


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 43 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 6 నవంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-



## బీజాపూర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

- కూంబింగ్ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి
- మృతదేహాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న బలగాలు
- జనవరి నుంచి ఇప్పటివరకు 477 మంది మావోయిస్టుల హతం
- ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వెల్లడి

5



## మరికాసేపట్లో బీహార్ పోలింగ్


- తొలి దశ పోలింగ్‌కు సర్వం సిద్ధం
- 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో ఓటింగ్
- ఈ దశలో మొత్తం 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, పలువురు ప్రముఖ నేతల భవితవ్యం తేలనుంది.
- ముఖ్యంగా హోరాహోరీ పోరు నెలకొన్న కీలక నియోజకవర్గాలపై సర్వత్రా ఆసక్తి

# 2 జిల్లాలు... 7 డివిజన్లు

## స్పష్టత దిశగా మంత్రివర్గ ఉపసంఘం

### ప్రతిపాదిత జిల్లాలు.. వాటి పరిధిలోకొచ్చే రెవెన్యూ డివిజన్లు

- కొత్తగా మదనపల్లె, మార్కాపురం జిల్లాలు!
- డివిజన్లుగా నక్కపల్లి, అద్దంకి, మడకశిర,
- బనగానపల్లె, పీలేరు, అవనిగడ్డ, గిద్దలూరు?
- 'కందుకూరు' మళ్లీ ప్రకాశం జిల్లాలోకి!
- పలు మండలాల 'జిల్లాలు' మార్పు
- పరిమితంగానే పునర్ వ్యవస్థీకరణ
- పాలనా సౌలభ్యం, చిరకాల డిమాండ్ల పరిశీలన
- ఉపసంఘంలో రెవెన్యూ శాఖ ప్రజెంటేషన్
- డివిజన్లపై మరింత స్పష్టత రావాలన్న మంత్రులు
- మరోసారి సమావేశమవుతాం: మంత్రి అనగాని




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై మంత్రివర్గ ఉపసంఘం, రెవెన్యూ శాఖలు స్పష్టత నిచ్చాయి. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో ఉన్న మార్కాపురం, చిత్తూరు జిల్లాలోని మదనపల్లెను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేయాలనే అభిప్రాయానికి వచ్చాయి. జిల్లాలు, డివిజన్ల పునర్వ్యవస్థీకరణపై బుధవారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం మరోసారి సమావేశమైంది. ఇప్పటిదాకా వచ్చిన ప్రతిపాదనలు, వాటిలోని సాధ్యాసాధ్యాలు, శాఖాపరమైన సూచనలపై రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ(ఇన్‌చార్జి) జి.సాయిప్రసాద్ ప్రజంటేషన్ ఇచ్చారు. దీని ప్రకారం... కొత్తగా రెండు జిల్లాలు, ఏడు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను పరిశీలించారు. దీని ప్రకారం... పీలేరు, మదనపల్లె రెవెన్యూ డివిజన్లతో 'మదనపల్లె జిల్లా'ను ఏర్పాటు చేసే అవకాశముంది. ఇందులో మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలు ఉండే అవకాశ ముంది. మదనపల్లె రాష్ట్రంలోనే అతిపెద్ద డివిజన్. కొత్తగా పీలేరును కూడా డివిజన్‌గా చేయాలన్న ప్రతిపాదన రెవెన్యూశాఖ నుంచే వచ్చింది. పలమనేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలు, చిత్తూరు డివిజన్‌లోని కొన్ని మండలాలతో కొత్తగా మదనపల్లె జిల్లా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందులో సదుం, సోమల, - మిగతా2లో

## ప్రతి 8 మంది ఓటర్లలో ఒకరు నకిలీ

- ఇది రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో జరుగుతోందని అనుమానిస్తున్నాం.
- హర్యానాలోని మా అభ్యర్థులు.. ఏదో తప్పు జరిగిందంటూ ఫిర్యాదులు విరివిగా చేశారు
- కాంగ్రెస్ విజయాన్ని బీజేపీ విజయంగా మార్చేందుకు ఒక ప్రణాళికను అమలు చేశారు
- హర్యానాలో 25 లక్షల ఓట్లు చోరీ అయ్యాయి

5



## ఇది సేవకు దక్కిన గుర్తింపు



- ఎన్టీఆర్ ట్రస్టు తరపున ఎన్నో కార్యక్రమాలు
- సంజీవని ఉచిత హెల్త్ క్లినిక్స్, మొబైల్ ఆరోగ్య శిబిరాలు
- మహిళా సాధికారతకు కృషిచేస్తున్నాం
- ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వెల్లడి
- లండన్‌లో ఐవోడీ సంస్థ నుంచి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు స్వీకరణ

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ఎన్టీఆర్ ట్రస్టు తరఫున సంజీవని ఉచిత హెల్త్ క్లినిక్స్, మొబైల్ హెల్త్ క్యాంప్స్, సురక్షితమైన తాగునీరు అందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా మంగళవారం అర్ధరాత్రి లండన్‌లో ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) సంస్థ నుంచి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ హెూదాలో ఆ సంస్థకు ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో ప్రకటించిన గోల్డెన్ - మిగతా2లో



## జనవరిలో గగన్‌యాన్ పరీక్ష.. 2035 నాటికి స్పేస్ ల్యాబ్

- జనవరిలో గగన్‌యాన్ ప్రాజెక్టు సంబంధించిన పరీక్ష
- అంతరిక్షంలోకి మానవులను పంపాలని ఇస్రో ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే.
- ఈ ప్రయోగాన్ని 2027లో చేపట్టాలన్న సంకల్పంతో ఉన్నం

5

## ఏటిమొగ-ఎదురుమొండి వంతెనకు సాస్కీ నిధులు

### పంట నష్టం అంచనాలు త్వరితగతిన పూర్తిచేయాలి

### అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం



అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలో తుపానుతో పంటనష్టం, అంచనాలు ఇతర అంశాలపై సమీక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. చిత్రంలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో ఏటిమొగ– ఎదురుమొండి హైలెవెల్ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సాస్కీ పథకంలో నిధులు కేటాయిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం అంచనాలు, నియోజకవర్గ అభివృద్ధి తదితర అంశాలపై బుధవారం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. 'కేంద్ర ప్రభుత్వ సహకారంతో అవనిగడ్డ ప్రాంతంలోని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల సమస్యకు పరిష్కారం చూపుతాం. నిలిచిపోయిన అభివృద్ధి పనులు అటవీశాఖ అనుమతులతో ముందుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం - మిగతా2లో



## పర్యాటకంలో పెట్టుబడులు.. అనేక రాయితీలు

### డబ్ల్యూటీఎంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్

### పెట్టుబడిదారులను ప్రోత్సహించేలా నూతన పర్యాటక విధానం

వివరాలు 2లో..

# 2 జిల్లాలు... 7 డివిజన్లు

-మొదటిపేజీ తరువాయి

చౌడేపల్లె, పుంగనూరు, రొంపిచర్ల, పులిచెర్ల మండలాలు ఉండనున్నాయి. మదనపల్లెలోని 11 మండలాలు ఎలాగూ ఉంటాయి. ఇక రాయచోటి డివిజన్‌లోని 4 మండలాలను (పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లె) కొత్త జిల్లాలో కలపాలని ప్రతిపాదించారు. మొత్తంగా ప్రతిపాదిత మదనపల్లె డివిజన్‌లో 28 మండలాలు ఉంటాయి.

**'మార్కాపురం జిల్లా' ఇలా...**


మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా 'మార్కాపురం జిల్లా' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందులో... గిద్దలూరు రెవెన్యూ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేస్తారు. మార్కాపురం జిల్లాలో 21 మండలాలు ఉండనున్నాయి. ఒకప్పుడు కందుకూరు డివిజన్ ప్రకాశం జిల్లాలో భాగంగా ఉండేది. జగన్ హయాంలో దీనిని నెల్లూరులో కలిపేశారు. ఇప్పుడు... మళ్లీ కందుకూరు డివిజన్‌లోని ఐదు మండలాలను (కందుకూరు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, ఓలేటివారిపాలెం)లను ప్రకాశంలో కలపాలని ప్రతిపాదించారు.

**కొత్తగా మరో 7 రెవెన్యూ డివిజన్లు**

ప్రస్తుతం రాష్ట్రంలో 77 రెవెన్యూ డివిజన్లున్నాయి. కొత్తగా మరో ఆరేడు డివిజన్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు మంత్రివర్గ ఉపసంఘం ముందుకు వచ్చాయి. నక్కపల్లి (పాయకరావుపేట), అద్దంకి, మడకశిర, బనగానపల్లి, పీలేరు, అవనిగడ్డ, గిద్దలూరుతోపాటు మరికొన్ని కొత్త డివిజన్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. పారిశ్రామిక క్లస్టర్‌లో భాగమైన నక్కపల్లి మండలం ప్రస్తుతం నర్సీపట్నం డివిజన్‌లో ఉంది. అయితే... పాయకరావుపేట కేంద్రంగా నక్కపల్లి డివిజన్‌ను ఏర్పాటు చేస్తారా? లేక ఆ డివిజన్‌కే 'పాయకరావుపేట' పేరు పెడతారా? అనే అంశంపై త్వరలో స్పష్టత వస్తుంది. ఈ డివిజన్‌లో యలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, రాయవరం మండలాలు ఉండాలని ప్రతిపాదించారు. అద్దంకి ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉంది. దానిని ఐదు మండలాలతో రెవెన్యూ డివిజన్‌గా మార్చి ప్రకాశం జిల్లాలో కలపాలని మంత్రి గొట్టిపాటి రవి కోరుతున్నారు. రెవెన్యూ శాఖ కూడా ఈ ప్రతిపాదన చేసింది. ఒంగోలు, కనిగిరి డివిజన్‌లలో ఉన్న మద్దిపూడి, పొన్నలూరు, కొండపి, జరుగుమిల్లి, సింగరాయకొండ, టంగుటూరు మండలాలను కందుకూరులో విలీనం చేయాలి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పుంగనూరును రెవెన్యూ డివిజన్ చేయాలన్న ప్రతిపాదన పరిశీలనకు వచ్చింది. అయితే, దానికన్నా పెద్దదయిన పీలేరునే రెవెన్యూ డివిజన్ చేయాలని రెవెన్యూ శాఖ తాజాగా ప్రతిపాదించినట్లు తెలిసింది. బనగానపల్లె నియోజకవర్గానికి ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బనగానపల్లెను రెవెన్యూ డివిజన్ చేయాలని ఆయన తొలి నుంచి కోరుతున్నారు. అవనిగడ్డను డివిజన్ చేయాలన్న ప్రతిపాదన కృష్ణా జిల్లా యంత్రాంగం నుంచి వచ్చింది. దీనిపై ఉపసంఘం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**మరి కొన్ని కీలక ప్రతిపాదనలు**

శ్రీకాకుళం జిల్లా నందిగామ, టెక్కలి మధ్య దూరం 11.5 కిలోమీటర్లు. కానీ... నందిగాం మండలం 21 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస డివిజన్‌లో ఉంది. అందువల్ల... నందిగాం మండలాన్ని టెక్కలిలో కలపాలి.




అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, చింతూరు డివిజన్‌లను తిరిగి తూర్పు గోదావరిలో కలపాలని ప్రతిపాదించారు. పెదబయలు మండలాన్ని విభజించి కొత్తగా గోమంగి మండలాన్ని ఏర్పాటు చేయాలని రెవెన్యూ శాఖ కోరింది.

రంపచోడవరం నియోజకవర్గం, దాని పరిధిలోని రంప, చింతూరు డివిజన్‌లను తూర్పు గోదావరిలో కలపాలని ప్రతిపాదించారు. రంపచోడవరంలో 8 మండలాలు, చింతూరులో 4 మండలాలున్నాయి.

కోనసీమలోని రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాలను రాజమండ్రి డివిజన్‌లో కలపాలని ప్రతిపాదించారు. రామచంద్రాపురం నియోజకవర్గంలోని కాజులూరును కోనసీమలోని రామచంద్రాపురం డివిజన్‌లో కలపాలని ప్రతిపాదించారు.

కాకినాడ డివిజన్‌లో ఉన్న సామర్లకోటను తిరిగి పెద్దాపురం డివిజన్‌లోకి తీసుకురావాలి.

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డివిజన్‌లో ఉన్న గణపవరం మండలాన్ని తిరిగి ఏలూరు జిల్లాలోకి తీసుకురావాలి.

ఏలూరు జిల్లాలోని నూజివీడు డివిజన్‌లో ఉన్న నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలను ఎన్టీఆర్ జిల్లాలోకి తీసుకురావాలి. అంటే... ఈ డివిజన్ ఎన్టీఆర్ జిల్లాలో భాగమవుతుంది. ప్రస్తుతం నూజివీడు డివిజన్‌లో ఉన్న చింతలపూడి, లింగపాలెం మండలాలను జంగారెడ్డిగూడెం డివిజన్‌లో కలపాలి.

ఏలూరు డివిజన్‌లో ఉన్న కైకలూరు నియోజకవర్గంలోని మండవల్లి, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి మండలాలను కృష్ణా జిల్లాలోకి తీసుకురావాలి.

గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరులను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి.

పరిపాలనా సౌలభ్యం కోసం ఈ ప్రతిపాదన చేశారు.

కొత్తగా గిద్దలూరు డివిజన్‌ను ప్రతిపాదించారు. ఇందులో గిద్దలూరుతోపాటు బేస్తవారిపేట, రాచర్ల, కొమరవోలు, కుంభం, అర్ధవీడు మండలాలున్నాయి.

గూడూరు డివిజన్‌లోని ఐదు మండలాలు (గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిత్తమూరు) తిరుపతి జిల్లాలో ఉన్నాయి. వాటిని తిరిగి నెల్లూరు జిల్లాలోకి తీసుకురావాలని ప్రతిపాదన.

కందుకూరు డివిజన్‌లోని 2 మండలాలు, ఆత్మకూరు డివిజన్‌లోని మరో 2 మండలాలను కావలిలో కలపాలి. అవన్నీ ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోనివే.

బాపట్ల రెవెన్యూ డివిజన్‌లోని మూడు మండలాలను (పరుచూరు, మార్టూరు, యద్దనపూడి ) చీరాల డివిజన్‌లో కలపాలి. ఇవన్నీ పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని మండలాలు.

చిత్తూరు జిల్లా నగరి డివిజన్‌లోని మూడు మండలాలు(నింద్ర, విజయపురం, నగరి) తిరుపతి జిల్లాలో కలపాలి. మిగిలిన కార్వేటినగరం, పాలసముద్రం మండలాలను చిత్తూరు డివిజన్‌లో విలీనం చేయాలి.

పలమనేరు డివిజన్‌లోని బంగారుపాలెం మండలాన్ని చిత్తూరు డివిజన్‌లో విలీనం చేయాలి.

తిరుపతి డివిజన్‌లో ఉన్న వడమాలపేట, పుత్తూరులను నగరి డివిజన్‌లో కలపాలి.

గూడూరు డివిజన్‌లోని వెంకటగిరి, బాలయ్యపల్లె, డక్కిలి మండలాలను శ్రీకాళహస్తిలో విలీనం చేయాలి.

పెనుకొండ డివిజన్‌లో ఉన్న ఐదు మండలాలతో మడకశిర డివిజన్ ఏర్పాటు చేయాలి. ఇందులో మడకశిర, గుడిబండ, రొళ్ల, అమరాపురం, అగలి ఉన్నాయి.

కర్నూలు జిల్లా పరిధిలోని ఆదోని మండలాన్ని విభజించి పెద్దహరివానం అనే కొత్త మండలం ఏర్పాటు చేయాలి.

**మార్పులు పరిమితంగానే**

చాలా పరిమితంగా జిల్లా, డివిజన్, మండలాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇప్పటికే ఏపీకి అఖిల భారత సర్వీసు అధికారుల కొరత తీవ్రంగా ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని భావిస్తోంది. కొత్తగా రెండు జిల్లాలకే పరిమితం కావాలని, డివిజన్ల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని మంత్రులు నిర్ణయించారు. జగన్ సర్కారు చేసిన తప్పిదాలకు పరిష్కారం చూపుతూనే, కొన్ని ప్రాంతాల ప్రజల చిరకాల డిమాండ్లను నెరవేర్చే దిశగా ప్రతిపాదనలు ఉండాలని మంత్రులు స్పష్టం చేసినట్లు తెలిసింది.

**మరోసారి చర్చిస్తాం: మంత్రి అనగాని**

ఉపసంఘం ముందుకు రెవెన్యూశాఖ తీసుకొచ్చిన అనేక ప్రతిపాదనలపై కీలక చర్చ జరిగింది. అయుతే, డివిజన్లపై మరింత స్పష్టత తీసుకురావాలని మంత్రులు సూచించారు. ఈ నేపథ్యంలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ విలేకరులతో చెప్పారు. వనరులను దృష్టిలోపెట్టుకొని, పరిమితంగానే పునర్వ్యవస్థీకరణ ఉంటుందని స్పష్టం చేశారు.

# ఆదుకోవాల్సింది పోయి..
# వీళ్లా ప్రభుత్వాన్ని నడిపేదీ?




చంద్రబాబు ప్రభుత్వం ప్రచార ఆర్భాటమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి మండిపడ్డారు. లోకేష్ 4 గంటల్లో 4వేల దరఖాస్తులు తీసుకున్నారని ఎల్లోమీడియా రాసింది. పబ్లిసిటీ కోసం తప్ప ప్రజలు నమ్ముతారో లేదో తెలుసుకోరా? అని దుయ్యబట్టారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పెన్షన్ల విషయంలోనూ దారుణంగా మోసం చేశారు. 5 లక్షల మంది పెన్షన్ దారులను తగ్గించారు. కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇప్పటికీ ఇవ్వలేదు" అంటూ నిలదీశారు. "రైతులపై తుపాను దెబ్బ కొడితే వారిని ఆదుకోవాల్సిందిపోయి గాలికి వదిలేశారు. చంద్రబాబు లండన్, లోకేష్ క్రికెట్ చూడటానికి వెళ్లారు. వీళ్లా ప్రభుత్వాన్ని నడిపేదీ?. గూగుల్ సెంటర్ వల్ల లక్షా 80 ఉద్యోగాలు వస్తాయని పబ్లిసిటీ ఇస్తున్నారు. నిజానికి పదివేల ఉద్యోగాలైనా తెప్పించగలరా?. ఆరోగ్యశ్రీ లేక జనం అల్లాడిపోతుంటే పట్టించుకోరా?. ఏ ఆస్పత్రిలోనూ ఆరోగ్యశ్రీ అమలు కావటం లేదు. రాష్ట్రంలో రైతులు బతకటమే కష్టం అన్నట్టుగా మారింది. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు టమోట, మామిడి, ఉల్లి పంటలను రోడ్డు మీద కాలువల్లో పడేసే దుస్థితి నెలకొంది. ..అన్ని వర్గాల ప్రజలు అసహనంతో ఉన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. సమస్యలతో జనం ఉంటే చంద్రబాబు లండన్‌లో విహరిస్తారా?. లులూ మాల్ పేరుతో వందల కోట్ల విలువైన భూమిని ధారాదత్తం చేస్తారా?. అందులో పెద్ద స్కాం ఉందన్న సంగతి సాధారణ ప్రజలకు కూడా తెలుసు. వైఎస్ జగన్ 18 సార్లు ప్రెస్‌మీట్ పెట్టి ప్రశ్నిస్తే ఒక్క దానికీ సమాధానం చెప్పలేదు. ఆదినారాయణరెడ్డికి దమ్ముంటే పోలీసులు లేకుండా ఒక్క జడ్పీటీసీ అయినా గెలవగలరా?. జగన్ సీటు ఇస్తే గెలిచి తర్వాత పార్టీ మారిన వ్యక్తి జగన్. అలాంటి వ్యక్తి ఇప్పుడు జగన్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడతారా? ..పోలీసులను అడ్డం పెట్టుకుని జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలిచి వీరుడిలాగ మాట్లాడతావా?. పోలీసులు లేకుండా ఒక్క సీటైనా గెలవగలరా?. అధికారం ఉందని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదు. మహిళా క్రికెటర్ శ్రీచరణికి ప్రభుత్వం ఎందుకు న్యాయం చేయలేదు?. మిగతా అన్ని రాష్ట్రాల క్రికెటర్‌లకు ఆయా ప్రభుత్వాలు కోటి చొప్పున పారితోషికం ఇచ్చాయి. ముంబాయి వెళ్లి క్రికెట్ చూసిన లోకేష్ ఎందుకు శ్రీచరణికి ప్రోత్సాహకాలు ఇవ్వలేదు?. నకిలీ మద్యాన్ని బయట పెట్టారనే జోగి రమేష్ ని అరెస్టు చేశారు. బెల్టు షాపులోని మద్యనే బస్సు ప్రమాదానికి కారణమన్నందుకు మా పార్టీ నేత శ్యామలాకు నోటీసులు ఇచ్చారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఏ గ్రామానికి వచ్చినా బెల్టుషాపును చూపిస్తా" అంటూ సతీష్‌రెడ్డి సవాల్ విసిరారు.

## ఏటిమొగ-ఎదురుమొండి వంతెనకు సాస్కీ నిధులు

-మొదటిపేజీ తరువాయి

అంచనాలు త్వరితగతిన పూర్తి చేయాలి. కృష్ణా జిల్లాలోనే 60 వేల మందికి పైగా సీసీఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులు ఉన్నట్లు చెబుతున్నారు. నష్టపోయిన ప్రతి కౌలు రైతుకూ న్యాయం చేయాలి' అని ఉపముఖ్యమంత్రి చెప్పారు. 'అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని తీర ప్రాంతంలో కాలువలను సముద్రానికి అనుసంధానిస్తూ నిర్మించిన అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో దెబ్బతిన్నాయని, దీంతో నాగాయలంక, కోడూరు మండలాల్లో సుమారు 5 వేల ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని నా దృష్టికి వచ్చింది. సముద్రం పోటెత్తినప్పుడల్లా ఉప్పు నీరు పొలాలను ముంచెత్తుతోందని రైతులు చెబుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో స్లూయిజ్‌ల పునరుద్ధరణకు ప్రస్తుతం రూ.50 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. నియోజకవర్గ పరిధిలో మొత్తం ఏడు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు పునర్నిర్మించాల్సి ఉంది. జాతీయ విపత్తుల నిర్వహణ నిధి నుంచి కేటాయింపులు చేసి నిర్మాణాలు పూర్తి చేస్తాం. అవసరమైతే ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలతో మాట్లాడతా.

ఎదురుమొండి– గొల్లమంద మధ్య రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్‌శాఖ నుంచి రూ.13.88 కోట్లు కేటాయించాం. టెండర్లు కూడా పూర్తయ్యాయి. రోడ్డులో అటవీ భూమి కొంత కలిసి ఉన్నందున పని నిలిచిపోయింది. అటవీశాఖ అధికారులు, కలెక్టర్ కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. హంసలదీవి పవిత్ర సాగర సంగమ ప్రాంతానికి ప్రజలు వెళ్లేందుకు అటవీశాఖ అధికారులు రుసుములు వసూలు చేస్తున్నారని తెలిసింది. భక్తుల మనోభావాలకు సంబంధించిన ఈ అంశంలో ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రోడ్లు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్, అటవీ, వ్యవసాయశాఖల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

## ఇది సేవకు దక్కిన గుర్తింపు

-మొదటిపేజీ తరువాయి

పీకాక్ అవార్డును అందుకున్న తర్వాత ఆమె ప్రసంగించారు. తనకు వచ్చిన అవార్డు.. సేవకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. మహిళా సాధికారిత కోసం పనిచేస్తున్నామని, వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వొకేషనల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు వారి సామర్థ్యాలు పెంచేందుకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలుస్తున్నామని, వారి జీవితం సాధారణ స్థితికి చేరుకునే వరకు చేయూతనిస్తున్నామని చెప్పారు. ఏపీ, తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆపన్నులకు సాయం అందిస్తున్నామన్నారు. 'ప్రజల జీవన విధానంలో మార్పుచేర్పులకు సంబంధించిన అంశాల్లోనూ సలహాలు అందిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కృషి చేస్తున్నాం. అందరికీ సమాన అవకాశాలు లభించాలన్న ఆశయానికి అనుగుణంగా పనిచేస్తున్నాం' అని వివరించారు.

**భువనేశ్వరికి గవర్నర్, లోకేశ్ అభినందనలు**

భువనేశ్వరి ప్రతిష్ఠాత్మక డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు పొందడం అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. తనతల్లి భువనేశ్వరి ప్రపంచవేదికపై అవార్డులతో సత్కారం పొందడం తనకెంతో గర్వకారణమని మంత్రి లోకేశ్ తెలిపారు. 'అమ్మా.. నీవు మన కుటుంబానికి స్ఫూర్తిదాయకంగా నిలిచావు. ఎన్టీఆర్ ట్రస్టు, హెరిటేజ్ ఫుడ్స్‌కు మంచి నాయకత్వం, సుపరిపాలన అందించడం ద్వారా వాటి పట్ల నిబద్ధతను చాటుకున్నారు. అదే ఇప్పుడు మీకు ప్రపంచవేదికపై గౌరవాన్ని తెచ్చిపెట్టింది' అన్నారు.

## పర్యాటకంలో పెట్టుబడులు.. అనేక రాయితీలు



అమరావతి

పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి తమ ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పెట్టుబడిదారులను ప్రోత్సహించేలా నూతన పర్యాటక విధానం, పారిశ్రామికహోదా వంటివి కల్పించామని ఆయన వివరించారు. లండన్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటీఎం)–2025 ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న మంత్రి యూకే లీడింగ్ ఏషియా ట్రావెల్స్ నిపుణుడు హరి దగ్గుబాటి, ఏకే ట్రావెల్స్ ఏజెన్సీ వ్యవస్థాపకులు ఆంథోనీ కింగ్స్, సీఎంసీవో సంస్థ మైస్ నిపుణుడు క్రిష్ పోర్ట్, తమిళనాడు పర్యాటక మండలి డైరక్టర్ జెక్కు కురియన్ కురియాకోస్ తదితరులతో భేటీ అయ్యారు. ఏపీలో పర్యాటక రంగంలో ఎందుకు పెట్టుబడులు పెట్టాలని వచ్చిన ప్రశ్నకు రాష్ట్రానికి ఉన్న ప్రత్యేకతలు, పెట్టుబడిదారులకు ప్రభుత్వం తరపున కల్పించే రాయితీలు తదితర విషయాలను మంత్రి వివరించారు.

## రాంగ్ రూట్ పట్టొద్దు



ఓర్వకల్లు

'జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెళ్లొద్దు. భద్రతా నియమాలు పాటించాల్సిందే' అని పోలీసులు స్పష్టం చేశారు. 'ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా!' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన చిత్ర కథనంపై కర్నూలు జిల్లా పోలీసులు స్పందించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేర కు ఓర్వకల్లు మోడల్ స్కూల్‌లో ఎస్ఐ సునీల్ కుమార్ ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. "రాంగ్ రూట్‌లో వెళ్తే కేసులు నమోదు చేస్తాం. విద్యార్థులను ఎక్కించుకొని వెళ్లే క్రమంలో కచ్చితంగా సక్రమమైన దారిలో వెళ్లి... రాక్ గార్డెన్ వద్ద యూటర్న్ తీసుకోవాలి. పరిమితికి మించి విద్యార్థులను ఆటోల్లో ఎక్కించుకోవద్దు. అధిక శబ్దంతో పాటలు పెట్టుకొని ఆటోలు నడపొద్దు" అని ఆటో డ్రైవర్లకు స్పష్టం చేశారు.

## మజ్జి, కిలపర్తి చర్చకు సిద్ధమా..

### టిడిపి సీనియర్ నేత బర్ల బాబురావు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సిటీ ప్రెసిడెంట్ మరియు నేషనల్ హైవేని ఆనుకొని, శ్రీనివాస వైన్స్, రాజమండ్రి స్టేడియం వెనక అల్యూమినియం కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్న రిలాక్స్ బార్ అండ్ రెస్టారెంట్ అధినేత అలాగే పక్క రాష్ట్రాల నుండి ఉల్లిపాయల లోడు మాటిన మద్యం తెచ్చి రాజమండ్రిలో విక్రయిస్తున్న మజ్జి రాంబాబు, తెలుగుదేశం పార్టీ మాజీ కార్పొరేటర్ ప్రస్తుత నగర ఎమ్మెల్యే బంధువు షెల్టన్ హోటల్ ఎదురుగా శ్రీ శ్రీనివాస వైన్స్ అధినేత పలు కేసులో జైలుకు వెళ్లి వచ్చిన కిలపర్తి శ్రీనివాస్ త్వరలో బర్ల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చర్చా వేదికకి మీ ఇరువురు వచ్చి మీ నిజాయితీని లిక్కర్ సిండికేట్‌తో ఎలాంటి సంబంధాలు లేవని నిరూపించు కోవలసిన బాధ్యత మీ ఇరువురికి ఉంది ఎందుకంటే మీ ఇరువురు వల్ల తెలుగుదేశం పార్టీ తలెత్తుకునే పరిస్థితి లేకుండా పోయింది కావున మీ ఇరువురు చర్చ వేదికకి వచ్చి పాల్గొనవలసిందిగా బలహీనవర్గాల ప్రతినిధి బర్ల బాబురావు ఆహ్వానిస్తున్నాడు మీ అభిప్రాయాన్ని పత్రికాముఖంగా గాని లేక సోషల్ మీడియా ద్వారా గాని తెలియజేయండి మీ అభిప్రాయం తెలిసిన వెంటనే రాజమహేంద్రవరం లో నిర్వహించు చర్చ వేదిక డేటు సమయం ప్రకటిస్తాం అప్పటివరకు మీరు సోషల్ మీడియా ద్వారా ఆడియోలతో మాకు సంబంధం లేదని చెప్పడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ఈరోజు పత్రిక ముఖంగా బలహీన వర్గాల ప్రతినిధి బర్ల బాబురావు ఓ ప్రకటనలో తెలియజేయడం జరిగింది.

## త్వరలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై నిరసన దీక్ష



**దేవిపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐదు సంవత్సరాల నుండి బయట గ్రామాల్లో అద్దెలకుంటూ అద్దెలో చెల్లించలేక ఇబ్బందులు పడుతూ జీవనం కొనసాగిస్తున్న దేవీపట్నం గ్రామ నిర్వాసితులకు గత వైయస్సార్ ప్రభుత్వం ప్రస్తుత కూటమి ప్రభుత్వం నుండి న్యాయం జరగకపోవడంతో నిర్వాసితుల సమస్యలపై నిరసన దీక్ష చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు అలాగే తొమ్మిది ఎకరాల సమస్యను సీరియస్‌గా తీసుకుంటామని దేవీపట్నం ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్వాసితుల కమిటీ సభ్యులు గేదెల పెద్ద సుబ్బారావు లంక పోశీరావు గేదెల చిన్న సుబ్బారావు దొడ్డ సింహాద్రి తెలిపారు ఈ దీక్షకు నిర్వాసితులందరూ సహకరించాలని కోరారు.

### కృష్ణుడి పాలెం ఆర్ అండ్ ఆర్ తోయ్యేరు కాలనీలో

## రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త మరియు తుప్పలు తొలగింపు




**దేవిపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవీపట్నం పంచాయతీ సంబంధించి కృష్ణుని పాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో సర్పంచ్ కుంజం రాజమణి మరియు పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆధ్వర్యంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త తుప్పలను తొలగించడం జరుగుతుంది. ప్రజలు రోగాల బారిన పడకుండా దోమలకు మందు యాంటీ లార్వా ఆపరేషనల్ స్ప్రేయింగ్ చేయించడం జరుగుతుంది. ఇట్లు దేవీపట్నంమండలం, దేవీపట్నం పంచాయతీ గ్రామ పంచాయతీ పంచాయతీ కార్యదర్శి తెలియజేశారు.

## ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

### నిరుద్యోగ యువతకు శిక్షణ తరగతులు ప్రారంభం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ఆర్ఎఎంపి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పారిశ్రామిక అధికారి వనిధర్ రమణ్ సూచించారు. రాజమండ్రి అర్బన్ నిరుద్యోగ యువతకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. గ్రామీణ యువతీ యువకులకు వివిధ అంశాలపై ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు.20 రోజుల పాటు జరుగుతాయన్నారు. వివరాలకు 7396610166 నంబరులో సంప్రదించాల న్నారు. కార్యక్రమంలో ఆర్టీఐ హెచ్ నోడల్ అధికారి సూర్యప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడను క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలి



### ఇంచార్జ్ కమిషనర్ కెటీ సుధాకర్

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరాన్ని క్లీన్ సిటిగా తీర్చిదిద్దే దిశగా ప్రతి పౌరుడు సహకరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జీ కమిషనర్ కె.టి. సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పారిశుద్ధ్య సర్కిల్-1 పరిధిలోని కృష్ణనగర్, వైద్యనగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మస్తార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ "కాకినాడను పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకం. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచి, చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికే అందించాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## పన్ను చెల్లించని ఖాళీ స్థలాలలో జప్తు చేస్తూ కార్పొరేషన్ అధికారులు బోర్డులు ఏర్పాటు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలో అనేక ఖాళీ స్థలాల యజమానులు పన్నులు చెల్లించకపోవడంతో నగరపాలక సంస్థ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పన్నులు చెల్లించని స్థలాలను ప్రభుత్వం 22(ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఖాళీ స్థలాలలో పన్ను చెల్లించకపోవుట వలన "ఈ ఖాళీ స్థలం జప్తు చేస్తున్నట్లు" బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు నగరంలోని దాదాపు 30 ఖాళీ స్థలాలలో జప్తు బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల 25వ తేదీలోపు ఖాళీ స్థలాల యజమానులు తమ పన్నులు చెల్లించాలని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. లేని పక్షంలో, ఆ తేదీ తర్వాత పన్నులు చెల్లించని స్థలాలను ప్రభుత్వం 22(ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## అమరజీవి బత్తుల భీష్మారావుకి ఘన నివాళి



**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కామ్రేడ్ బత్తుల భీష్మరావు మృతి చెంది నేటికి 40 ఏళ్ళు ఆనాడు ఈ ప్రాంతంలో ఆదివాసులు నిరుపేదల పట్ల ఈ ప్రాంతంలోని దోపిడీదారులు వెట్టి సాకిరికి ఫారెస్ట్ దోపిడీలకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు చేసిన మహా నాయకుడు బత్తుల భీష్మారావు సిపిఎం పార్టీ చింతూరు మండల కమిటీ, మరియు కుటుంబ సభ్యులు 40 వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించడం జరిగినది. చింతూరు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం నందు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించినారు చింతూరు మండలం పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, భార్య హైమావతి, కుమారుడు లెనిన్, కుమార్తె అన్నదమ్ములు కుటుంబ సభ్యులు హాజరవడం జరిగింది, సందర్భంగా ఈ సందర్భంగా భార్య హైమావతి మాట్లాడుతూ ఆనాడు 1985 ఈ ప్రాంతంలోని పేద ప్రజల దోపిడీపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ సిపిఎం పార్టీ పోరాటాల తోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని నమ్మి ప్రజలను పోరాటాల వైపు మళ్ళించి నాయకుడిగా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఆనాడు ఈ ప్రాంతంలో ఉన్న రాడికల్స్ నెక్సల్స్ అనేకసార్లు బెదిరింపులు హెచ్చరికలు చేసిన ఈ ప్రాంత ప్రజలకు న్యాయం జరగడమే నా పోరాటానికి చివరి శ్వాస వరకు అంకితమై ఉంటానని ప్రజలే నాకు మార్గదర్శకులు అంటూ ప్రజల్లోనే ఉన్నారని అందుకే నేటికీ ఈ ప్రాంతం అభివృద్ధిలో ప్రజలలో భీష్మ రావు చిరస్మరణీయుడుగా అమరజీవిగా ప్రజలలో ఉన్నారని అనేక గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీకి ఆదరణ తగ్గకుండా పోరాటాలను ప్రజలు ముందుంటున్నారని అన్నారు. భీష్మారావుని స్మరించడం అంటే ఈ ప్రాంతంలోని పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడంతో పాటుగా ప్రజా సమస్యలపై ప్రజలను కదిలించి సమస్య పరిష్కారం వరకు పోరాటాలలో ఉండటమేనని ఈనాటి పాలకుల ప్రైవేటీకరణ విధానాలను ప్రజలను చైతన్యవంతం చేసి ఈ ప్రాంత ఆదివాసి హక్కులకు పోరాటాలకు న్యాయం జరిగే విధంగా పార్టీ కార్యకర్తలు అందరూ కృషి చేయాలని అన్నారు కేంద్రంలోని బిజెపి ఆత్మ నిర్భయ భారత్ అంటూ దేశంలోనే ప్రజా సంపదను కార్పొరేట్ అధినేతలకు దోచి పెట్టేటందుకు విమానాశ్రయాలు, రైల్వేలు, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, ఏ ఒక్కటి కూడా ప్రజాల సంపదగా ఉంచ కుండా ప్రైవేటు వ్యక్తులకు దారా దత్తం చేస్తున్నారని నేడు పరిశ్రమలకు నెలకొల్పడానికి భూములను విచ్చలవిడిగా కార్పొరేట్ సంస్థలకు అనేక రకాల రాయితీలతో కట్టబెడుతూ ప్రజా సంపదను కూని చేస్తున్నటువంటి పాలకుల విధానాలపై ప్రజలను పోరాటాలకు తీసుకురావాలని పాలకుల వినాశకర విధానాలపై ప్రజలను చైతన్యం చేయటమే భీష్మారావు గారికి నిజమైన నివాళి అని ఆ విధంగా ఈ ప్రాంత పార్టీ కార్యకర్తలు అందరూ కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం చింతూరు మండల కార్యదర్శి పలపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు సిసం సురేష్ కుటుంబ సభ్యులు బత్తుల లెనిన్ కుమార్తె సృజన అల్లుడు మహేందర్, అన్నదమ్ములు మరియు సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, రంగమ్మ, లక్ష్మణ్, కారం సుబ్బారావు, మడకం సిన్నయ్య మల్లం సుబ్బమ్మ, పిడగయ్య, చింతా రాంబాబు, బివి రమణ, సోడి చిన్నామి కమల, తదితరులు పాల్గొన్నారు.

## సూపరింటెండెంట్‌ను కలిసిన ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి జిజిహెచ్ సూపరింటెండెంటుగా ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పివివి సత్యనారాయణను తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ సంఘాల అధ్యక్షులు కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆయన చాంబర్లో కలిసి దుస్సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పివివి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎందరో పేదలకు వైద్య సేవలు అందిస్తున్న రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో ఆనందకరమని సంతోషం వ్యక్తం చేశారు.ఈ ఆస్పత్రికి వచ్చే ప్రతి పేషంటుకి ఉత్తమమైన సేవలు అందించి రాష్ట్ర ప్రభుత్వానికి, వైద్య శాఖకు మంచి పేరు తేవడంలో శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. సిబ్బంది సేవలను పేషెంట్లకు త్వరితగతిన అందేటట్లు చేస్తామని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ సంఘాల జిల్లా అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి,నాయకులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, దారా ఏసురత్నం, ఎం.సత్యనారాయణ, కాశీ నవీన్ కుమార్, జంగం సుబ్బారావు, ఉసురుమర్తి రామారావు, కళాఖర్, మానుకొండ దేవిడ్, లంకపల్లి దేవిడ్, అజ్జరపు గిరిబాబు, బడుగు రాజు, కొలూరి వెంకట్రావు, వి.వెంకటేశ్వర రావు, అర్ధాల కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరి రాజ్యలక్ష్మి 175వ జయంతి

### డాక్టర్ (మేజర్) చల్లా సత్యవాణి సహస్ర చంద్ర దర్శనోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వి.టి.డిగ్రీ కళాశాల ఆనందా గార్డెన్స్ లో శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి 175 జయంతోత్సవం, డాక్టర్ (మేజర్)చల్లా సత్యవాణి సహస్ర చంద్ర దర్శనోత్సవం క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టి.కె.విశ్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ టి.ఉమామహేశ్వరి, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాసా జయ ప్రద, సామాజిక కార్యకర్త,దాత తాడేపల్లి భానుమతిలను క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగా భవాని వేదిక మీదకు ఆహ్వానించారు .ముఖ్య అతిథులు మాట్లాడుతూ శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి సామాజిక సేవ,భర్త కందుకూరి వీరేశలింగం పంతులుకు అందించిన తోడ్పాటు, స్త్రీల జీవితాలు మెరుగుపరచడానికి ఆమె చేసిన కృషిని అందరికీ వివరించి పుష్పాలతో నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ (మేజర్) చల్లా సత్యవాణి సేవా తత్పరతను,దేవాలయాల చరిత్ర వెలుగులోకి తేవడంలో ఆమె పరిశోధన, గ్రంథరచనలు చేయడంలో ఆమె కృషిని కొనియాడి సహస్ర చంద్ర దర్శనోత్సవం శుభాకాంక్షలు తెలియచేశారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పించన్లు, ఉదయం అల్పాహారం, దుప్పట్లు, అన్నప్రసాదం పంపిణి చేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఉప్పులూరి కాశీ విశ్వనాథం, సూరపురెడ్డి తాతారావు, గీసాల బాబ్జి, అనసూరి శ్రీనివాస్ రామబ్రహ్మం రొక్కం అప్పారావు, మావూరు రామకృష్ణ, లంకే శ్రీదేవి, మొగల్తూరు దుర్గ, విశ్రాంత అధ్యాపకులు డి.లలితాదేవి, టి.వి.లత, వసుంధర, మేడపాటి సాయిరెడ్డి పాల్గొని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమం అంతా సంస్థ వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు అధ్యక్షతన జరిగింది.

## సర్కస్ ఆట కాదు ఒక జీవితం...

### నగరంలో సర్కస్‌ను ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ






**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** సర్కస్ అనేది మనం చూసేందుకు ఆటగానే కనిపిస్తున్నా అవి కొందరి జీవితాలకు ఉపాధి అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరావు (నానాజీ) అన్నారు. బుధవారం సాయంత్రం కాకినాడ జేఎన్టీయూ దగ్గర్లో ఉన్న గ్రౌండ్లో బింగో సర్కస్ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ ఇది ఎంతో కష్టం జాగ్రత్తలతో కూడుకున్నదన్నారు. ఈ ప్రదర్శనను కాకినాడ నగర ప్రజలు తిలకించి వారికి సహకరించాలని నానాజీ కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జనసేన నాయకులు ఆట్ల సత్యనారాయణ, చోడిశెట్టి శ్రీమన్నారాయణ, నిర్వాకుడు వజీర్, బింగో సర్కస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్వంవాయిస్
VISWAMVOICE TELUGU DAILY

## ఎడిటర్ వాయిస్

# పర్యావరణ పరిరక్షణ ఏదీ?

అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అనేది ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక లాభం కోసం సహజ వనరులను దోచుకోవడం, దుర్వినియోగం చేయడం. ఇది ప్రధానంగా అడవుల నరికివేత, ఖనిజ సంపదను పెద్ద స్థాయిలో తవ్వుకోవడం, నీటి వనరులను అతిగా వినియోగించడం వంటి రూపాలలో ఉంటుంది. ఈ దోపిడీ వల్ల స్థానిక జీవజాలం, స్థానిక జనాభా తీవ్రంగా ప్రభావితం అవుతుంది. తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ పర్యావరణం మరియు వనరులను పరిరక్షించడానికి తగిన విధానాలను అనుసరించలేక పోతున్నాయి. ఇది ఆ దేశాల పర్యావరణాన్ని తీవ్ర స్థాయిలో నాశనం చేస్తోంది. ప్రపంచం మొత్తం పర్యావరణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం, నీటి ప్రదూషణ, జీవవైవిధ్యం నష్టం వంటి అనేక సమస్యలు మన జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు ప్రధాన కారణం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పర్యావరణ దోపిడీ. ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతర దేశాల సహజ వనరులను దోపిడీ చేయడం, తద్వారా స్థానిక ప్రజల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావం చూపడం, పర్యావరణ దోపిడీకి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ సమస్యను అరికట్టేందుకు మరియు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్ట దినాన్ని పాటిస్తారు. ఈ సందర్భంలో అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అంటే ఏమిటి, దాని ప్రభావాలు, నివారణ చర్యలు, మన బాధ్యతలు వంటి అంశాలను పరిశీలించడం అవసరం. అడవుల నరికివేత, భారీ పరిశ్రమల నెలకొల్పటం, రసాయనాల వాడకం వంటివి అనేక జంతువుల, వృక్షజాలం నివాసాలను ధ్వంసం చేస్తాయి. వీటి వల్ల అనేక జీవజాతులు అంతరించి పోతాయి. జీవవైవిధ్యం కనుమరుగవడం వల్ల పర్యావరణ సమతుల్యతలో గణనీయమైన మార్పులు వస్తాయి. పరిశ్రమల నుంచి ఉద్గారాలు, వ్యవసాయ రసాయనాలు, మరియు ఇతర వ్యర్థ పదార్థాలు నదులు, సముద్రాలు, వాయు మండలాన్ని కలుషితం చేస్తాయి. ఇది పర్యావరణానికి మాత్రమే కాకుండా, మన ఆరోగ్యానికీ ప్రమాదకరం. దీని వలన వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, భూసమర్థవంతత తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వనరులను అతిగా వినియోగించడం, చెట్లను నరికివేయడం, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను పెంచడం వలన వాతావరణంలో వేడి పెరుగుతోంది. దీని కారణంగా గ్లోబల్ వార్మింగ్ అనే సమస్య పెరిగి వాతావరణంలో అతివృష్టి, కరువు వంటి ప్రతికూల మార్పులు చోటు. చేసుకుంటున్నాయి. వాతావరణ మార్పు వల్ల వరదలు, కరువులు, అగ్ని ప్రమాదాలు వంటి సహజ వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ ప్రక్రియలతో పర్యావరణ నాశనం తక్షణమే కనిపించక పోయినా, దీర్ఘకాలంలో వీటి ప్రతికూల ప్రభావం పెద్ద స్థాయిలో ఉంటుంది. కాలుష్యం వల్ల మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, నీటి కాలుష్యం వల్ల నీటి ద్వారా వ్యాప్తిచెందే వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంలో విష పదార్థాలు చేరటం వల్ల కేన్సర్, జన్యు వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీని అరికట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణ కోసం పలు అంతర్జాతీయ ఒప్పందాలు కుదిరాయి. టోక్యో ప్రోటోకాల్, పారిస్ ఒప్పందం వంటి ఒప్పందాలు ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు దేశాలు ఒక ప్రణాళికను అనుసరిస్తున్నాయి. ఈ ఒప్పందాలు పర్యావరణ పరిరక్షణకు దేశాల మధ్య సహకారాన్ని పెంపొందిస్తున్నాయి. ప్రతి దేశం పర్యావరణ పరిరక్షణ కోసం స్వంత చట్టాలను రూపొందిస్తోంది. వనరులను అధికంగా వినియోగించే సంస్థలపై నియంత్రణ విధించేలా చట్టాలు అమలు చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ, వనరుల పరిరక్షణ, రక్షణాత్మక చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరియు ఇతర సంస్థలు జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పర్యావరణ సమస్యలను ప్రజలకు వివరించడం, అవగాహన కల్పించడం వల్ల ప్రజలు తమ జీవనశైలిని సవరించు కోవడానికి ఆసక్తి చూపిస్తారు. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవనశక్తి వంటి పునరుత్పాదక ఇంధనాలను వినియోగించడాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ వనరులు పర్యావరణానికి హానికరమైన కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయ. పడతాయి. ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి. వాహనాలను తక్కువగా వినియోగించడం, పునర్వినియోగ పదార్థాలు ఉపయోగించడం



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# భారంగా రీయంబర్స్‌మెంట్ బకాయిలు!



సామాజిక సేవగా అందాల్సిన విద్య సరళీకర ఆర్థిక విధానాల పుణ్యమా అని పూర్తిగా ప్రయివేటీకరించబడింది. ఫలితంగా తెలుగు నాట అనేక ప్రయివేటు విద్యాసంస్థలు కుప్పలుతెప్పలుగా వెలిశాయి.విద్య పెట్టుబడి లేని చిన్న వ్యాపారం కనుక కాస్తా కూస్తో ఆస్తులు ఉన్నవారు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టారు. ప్రభుత్వాలు కూడా అప్పటివరకు ఉన్న ప్రభుత్వ డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల స్థానంలో ప్రయివేటు యాజమాన్యాలను ప్రోత్సహించి, విచ్చలవిడిగా అనుమతులిచ్చింది. ప్రభుత్వ విద్యారంరంగానికి ఇచ్చే గ్రాంట్లు, నియామకాలు తగ్గించి వేశాయి. ఒకరకంగా ప్రభుత్వం ఉన్నత విద్యాబాధ్యతల నుండి క్రమంగా వైదొలగుతూ వచ్చాయని చెప్పవచ్చును. అంతేకాదు, ఒకప్పుడు అన్నీ డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలు ప్రభుత్వ రంగంలో మాత్రమే ఉంటే, ప్రభుత్వ వైఖరి మూలంగానే ప్రయివేటు విద్యావ్యవస్థ వేళ్లూనుకుంది. అందు కు ఉదాహరణ తెలంగాణా రాష్ట్రంలో 696 డిగ్రీకళాశాలలు ఉంటే అందులో 578 ప్రయివేటు కళాశాలలు. 256 ఇంజ నీరింగ్ కళాశాలల్లో 202 ప్రయివేటు యాజమాన్యంలోనే ఉన్నాయి.123 పార్మసీ కళాశాలలుంటే వాటిలో 103 ప్రయివేటు యాజమాన్యం లోనివే.ఈ గణాంకాలు దేన్ని సూచిస్తున్నాయి? దీంతో ప్రయివేటు, ప్రభుత్వ విద్యానాణ్యత, సౌకర్యాల మధ్య అంతరం పెరిగింది. దీంతో ప్రభు త్వ విద్యాలయాల్లో నమోదు తగ్గి, ప్రయివేటు విద్యాసంస్థల్లో నమోదు శాతం పెరిగింది. ఈదశలో అధికారంలోకి వచ్చిన వైయస్ రాజశేఖరరెడ్డి తిరిగి ప్రభుత్వ కళాశాలలకు ప్రాణప్రతిష్ట చేయడానికి బదులు అప్పటికప్పుడు ఓట్ల ప్రయోజనం చేకూరే ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం వైపు మొగ్గుచూపారు. ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు పూర్తిగా దివాళా తీయగా, పోటీలో కునారిల్లే దశలో ఉన్న ప్రయివేటు ఇంజనీరింగ్‌తో పాటు డిగ్రీ కళాశాలలకు తిరిగి ప్రాణప్రతిష్ట చేసినట్లయింది. ప్రభుత్వ ఉన్నత విద్యావ్యవస్థను బలోపేతం చేయాల్సిన కోట్లాది రూపాయలు ప్రజాధనం ఫీజురీయంబర్స్‌మెంట్ పేరుతో ప్రయివేటు విద్యాసంస్థల ధారాదత్తం చేసి పడేశాడు.అయితే ఇందులో చదువకున్న కొంతమంది పేద విద్యార్థులకు ఇది మేలు కూర్చిన మాట వాస్తవం. కానీ పేదల ఆస్తిగా అభివృద్ధి చెందాల్సిన ప్రభుత్వ కళాశాలల్ని గాలికి వదిలిన ఫలితంగా ఫీజురీయంబర్సమెంట్ సంక్షోభం దశకు చేరుకుంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం 2015లో "తెలంగాణా రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఫీజు రీయంబర్స్ మెంట్" అనే వ్యవస్థను దీనికోసం ఏర్పాటు చేసింది.అయితే మూతపడ్డ ఇంజనీరింగ్ కళాశాలలను అద్దెకు తీసుకుని ఈయన గురుకులాలను ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మందగించింది. వైఎస్సార్ ఉన్నత విద్యావ్యవస్థను, కేసీఆర్ ప్రాథమిక విద్యావ్యవస్థ మనుగడను తమ అనాలోచిత నిర్ణయాల వలన దెబ్బతీసినట్లయింది. కేసీఆర్ రెండవసారి అధికారంలోకి వచ్చిన కాలంలోనే ఒక్కో ప్రయివేటు కళాశాలకు కోట్లాది రూపాయల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు పోగుపడ్డాయి. తప్పనిసరి పరిస్థితుల్లో 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈ పథకం కొనసాగించాల్సిన అనివార్యత చోటుచేసుకుంది.

అయితే ఇక్కడ కొనసాగించ డమంటే బంద్ చేయాలని ఉద్దేశం కాదు, దాన్ని అమలును పూర్తిగా పట్టించుకోకపోవడం వల్ల పథకమే పతానవస్తకు చేరింది. ఇప్పటికీ ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో కోట్లాది రూపాయల బకాయిలు పేరుకుపోయాయి. "కన్నతల్లికి కూడు పెట్టనోడు పినతల్లికి బంగారు గాజులు చేయిస్తా" అన్న చందంగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం విదేశీ యూనివర్సిటీల్లో చదివేవారి ఫీజు బకాయిలు విడుదల చేసింది. కానీ, ఇక్కడ ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు మాత్రం విడుదల చేయకపోవడం శోచనీయం. ఇప్పటికే 10వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రయివేటు విద్యాసంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని సమాచారం. ఏడాదిన్నర కాలంగా ప్రయివేటు విద్యా సంస్థలని సర్కార్ ఏదోవిధంగా బుజ్జగిస్తూ వస్తున్నది. అయినప్పటికీ తమ బకాయిలు చెల్లించకపోవడంతో గత్యంతరం లేని స్థితిలో ప్రయివేటు కళాశాలల యాజమాన్యం బంద్‌కు పిలుపునిచ్చింది. విద్యార్థుల పరీక్షల ముందు ప్రతియేటా ఇలా చేయడం కూడా సరైంది కాదు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత కూడా యాజమాన్యాలపై ఉంది. ఎందుకంటే, ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో హాల్‌టిక్కెట్లు, పై చదువుల కోసం వెళ్లే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఆ భారమంతా ఇప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులు మోయాల్సి వస్తున్నది. ఇది కూడా సర్కార్ గమనించి పరిష్కరించాల్సిన అంశం. కార్పోరేట్ స్థాయి సంస్థలు తప్ప, చిన్న చిన్న ప్రయివేటు విద్యాసంస్థలకు రూ.ఐదు కోట్లు, పెద్ద సంస్థలైతే పది కోట్ల ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం బకాయిలు చెల్లించడం తలకు మించిన భారమే కావచ్చు! కానీ ఇచ్చిన హామీ ప్రకారం విడతల వారిగా రూ.600కోట్లు చెల్లిస్తామని చెప్పి విస్మరించడం బాధ్యతారహిత్యం. దాంతోనే యాజమాన్యాలు మళ్లీ సమ్మెబాట పట్టాయనడంలో సందేహం లేదు. అలాగే గతంలో ఉన్నవి చెల్లించబోమని, కొత్త బకాయిలకే తమ బాధ్యత అని చెప్పడం కూడా సరైందికాదు. ప్రభుత్వమంటేనే మంచీచెడులు అన్ని చూడాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ప్రభుత్వ నేతలో అది లోపించందని అర్థమవుతున్నది. ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యం కూడా విషమపరిస్థితులనే ఏదుర్కొంటున్నాయి. తమవద్ద ఉన్న వందలాది మంది బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది వేతనాల చెల్లింపునకు స్థిరాస్తులు తెగనమ్ముకుంటున్న పరిస్థితి. ఇలాంటి స్థితిలో ఫీజురీయంబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం ఇచ్చే ఉపశమనంపై లేపనం లాంటిదే గాని పూర్తిగా స్వాంతన చేకూర్చే చర్య కూడా కాదు!? దీర్ఘకాలిక సామాజిక అభివృద్ధి ప్రణాళిక లేని ఇలాంటి డొల్ల పథకాల డొల్లతనాన్ని, పాలకుల ఆలోచనల్లోని అవిటితనాన్ని బహిర్గత పరుస్తున్నది. ప్రస్తుతం ప్రభుత్వ విద్యావ్యవస్థ ఎప్పుడో దెబ్బతిన్నా ఈ ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలతో ప్రయివేటు విద్యావ్యవస్థ పతనం అంచుపై వేలాడుతోంది.అటు ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం కాకపోవడం, ఇటు ప్రయివేటు విద్యావ్యవస్థ కూడా దెబ్బతింటుండంతో ఇక ప్రభుత్వం సాధించేదేమిటి? భావి భారత విద్యార్థులకు గాలికొదిలేయటమే కదా! ఇప్పటికైనా ప్రయివేట విద్యా వ్యవస్థ స్థానంలో ప్రభుత్వ ఉన్నత విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. దీంతోపాటు, ప్రభుత్వ కళాశాలలను అన్ని సౌకర్యాలు, ఆధునిక కోర్సులు, పూర్తి ప్యాకాల్టీతో పునరుద్ధరణ చేయాలి.పేదలకు అవసరమైన నాణ్యమైన, ఉన్నత విద్యా అవకాశాలు ప్రభుత్వ రంగంలో నే ఉచితంగా అందుబాటులోకి తేవాలి. ఇకనైనా ఫీజురీయంబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీలాంటి కార్పోరేట్ సంస్థలను బలోపేతం చేసే విధానాలకు బదులు, అవే నిధులతో ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ బడులు ఆధునీకరణ చేయడం ద్వారా దీర్ఘకాలిక నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం ప్రజలకు అందే అవకాశం ఉంటుంది.

# హద్దుమీరిన నిర్లక్ష్యం ప్రమాదం

విశాలమైన మన దేశంలో రోడ్డు ప్రమాదాలు జరగడం సహజమే.. అయినా కానీ ఆయా ప్రమాదాలకు కారణాలు రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి రోడ్డు, డ్రైవింగ్ సంబంధిత కారణాలు, ఇక రెండవది వ్యవస్థీకృత లోపాల మూలాన జరిగే యాక్సిడెంట్స్. దీనికి ప్రధానంగా వ్యవస్థలలో ఉన్న లోపాలే కారణం. రోడ్డు డ్రైవింగ్ కారణాలలో అతివేగం డ్రైవర్ల సమన్వయ లోపంలో రాత్రి వేళ డ్రైవర్లు నిద్రమత్తులో ఉండడం వంటివి ప్రధానంగా కనిపిస్తాయి. కర్నూలు ఘటనలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన తర్వాత డ్రైవర్ వెంటనే బస్సును ఆపకపోవడం, చిన్న ప్రమాదంగా భావించడం కూడా తీవ్రతను పెంచింది. ఆ బస్సు ప్రమాదం, అక్కడ జరిగిన అగ్నిప్రమాదం రాష్ట్రంలోనే కాక, దేశవ్యాప్తంగా రవాణా భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది. రాత్రివేళ జరిగిన ఈ ఘోర ప్రమాదంలో బస్సు పూర్తిగా దగ్ధమై, ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. రోడ్డు ప్రమాదాల కంటే కూడా బస్సు అగ్నిప్రమాదాలు మరింత ఎక్కువ ప్రాణ నష్టానికి కారణమవుతున్నాయి. సాధారణంగా బస్సు ప్రమాదాలకు అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రధాన కారణాలు అవుతుంటాయి. అయితే, కర్నూలు ఘటనలో బస్సు ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడం వల్ల ప్రమాదం మొదలైనట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. బైక్‌ను ఈడ్చుకెళ్లడం వల్ల ఇంధన ట్యాంక్ దెబ్బతిని, డీజిల్ రోడ్డుపై చిందడం, ఇంజిన్ వేడితో నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించాయి. ఈ చిన్న ప్రమాదమే ఇంతటి ఘోర విషాదంగా మారడానికి అనేక భద్రతా లోపాలు కారణమయ్యాయి. అత్యవసర ద్వారాలు పనిచేయకపోవడం, అద్దాలు పగలగొట్టే హ్యామర్‌లు అందుబాటులో లేకపోవడం, బస్సులో ఖాళీ ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఉండడం వంటి నిర్లక్ష్యాలు మంటల నుండి ప్రయాణికులు తప్పించుకునే అవకాశాన్ని పూర్తిగా లేకుండా చేశాయి. వాహన లోపాలకు వస్తే, ఇక్కడ ట్రావెల్స్ యాజమాన్యం బాధ్యత చాలా ఎక్కువగా ఉంది. నిబంధనలకు విరుద్ధంగా లగేజీ క్యాబిన్‌లో అధిక సంఖ్యలో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర సులభంగా అంటు కునే పదార్థాలను రవాణా చేయడం మంటల తీవ్రతను పెంచింది. ముఖ్యంగా, లిథియం బ్యాటరీలు అధిక వేడికి పేలిపోవడం వల్ల మంటలు వేగంగా ప్రయాణికుల కంపార్ట్‌మెంట్‌కు వ్యాపించాయి. అత్యవసర నిష్క్రమణ మార్గాలు పనిచేయకపోవడం, ఫైర్ సేఫ్టీ వ్యవస్థ లేక పోవడం అనేది స్పష్టమైన భద్రతా నియమాల ఉల్లంఘన. ఈ నిర్లక్ష్యానికి ట్రావెల్స్ యజమానులే మొదటి బాధ్యులు. అంతేకాకుండా రవాణా శాఖ అధికారులు కూడా తగిన తనిఖీలు




చేయకుండా, నిబంధనలు ఉల్లంఘించిన వాహా నాలను రోడ్లపై తిరగడానికి అను మతించడం వల్ల వారు కూడా పరోక్షంగా బాధ్యత వహించాలి. ద్విచక్ర వాహనాలను నడిపేవారికి హెల్మెట్ లేకపోతే ఫైన్ వేసే అధికారులకు ఇటువంటి సరైన పర్మిట్లు లేని బస్సులు కనిపించవా? అన్నదే సామాన్యుని మదిలో మెదులుతున్న ప్రశ్న ! ఇప్పటికైనా వారు కళ్లు తెరిచి హడావుడి చెకింగ్‌లు కాకుండా సరైన పర్మిట్లు లేని బస్సులపై కొరడా ఝుళిపించాలి. రోడ్లపై పెట్రోలింగ్ పెంచాలి. కర్నూలు బస్సు దుర్ఘటన కేవలం ఒక రోడ్డు ప్రమాదం కాదు, ఇది మన రవాణా వ్యవస్థలోని లోపాలను, నియం త్రణ లేమిని, లాభాపేక్షతో కూడిన నిర్లక్ష్యాన్ని చూపించే ఒక హెచ్చరిక. నిండు ప్రాణాలను బలిగొన్న ఈ విషాదం నుండి మనం గుణపాఠం నేర్చుకోవాలి. కేవలం దర్యాప్తు నివేదికలు సమర్పించడం కాకుండా, ప్రభుత్వాలు, రవాణా శాఖ అధికారులు, ట్రావెల్స్ యాజమాన్యాలు కలిసి కట్టుగా చిత్తశుద్ధితో పనిచేసి భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలి. ప్రతి పౌరుడి ప్రాణం విలువైంది. ఇకపై ఇటువంటి విషాదాలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడం తక్షణ కర్తవ్యం. రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం మీర్జాగుడ వద్ద జరిగిన తాజా ఘటనలో ఆర్టీసీ బస్సును కంకర లోడు టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో బస్సు కుడి వైపు పూర్తిగా నుజ్జునుజ్జయింది. బస్సులో 70 మంది ప్రయాణి కులున్నారు. కంకర కింద ఇరుక్కుపోయి 24 మంది మృతి చెందారు. టిప్పర్ బోల్తా పడడంతో డ్రైవర్ అక్కడి కక్కడే మృతిచెందారు. ఈ మృతుల్లో ఎక్కువ మంది విద్యార్థులు, ఉద్యోగులు. పేరుకే ఆర్టీసీ బస్సే అయినా, ప్రైవేట్ బస్సును లీజుకు తీసుకున్నారని సమాచారం. ఎట్లా ఈ పరిస్థితి మారేది? బయటికి వెళ్లిన వాళ్లు ఇక తిరిగి వస్తారనే నమ్మకం పూర్తిగా నశించిపోతూ ఉంది. మళ్లీ మళ్లీ అదే మాట..'ఇక్కడ కుక్కల ప్రాణాలకు ఉన్న విలువ మనుషుల ప్రాణాలకు లేదు. సత్యం'.





### పాడి రైతులకు

# పసిడి పండించే 'కోనసీమ పశువుల దాణా'

**జిల్లా వ్యాప్తంగా పశుగ్రాసం లోటుతో పాడి రైతులకు నష్టాలు - జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనతో పాడి రైతులకు వరం**

**పశువులలో పాల దిగుబడి, పునరుత్పత్తి సామర్థ్యం పెంచే కోనసీమ పశువుల దాణా - తక్కువ ధరకే పోషకాలు నిండిన పశుదాణా సరఫరా**

**పశుసంవర్ధక, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సంయుక్త నిర్వహణ**

**ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా పంట రుణం, ఎరువులతో పాటు పశుదాణా లబ్ధి**





**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాడి పశువులలో పాలదిగుబడి పెంచి, పశువుల పునరుత్పత్తి సామర్థ్యం మెరుగుపరిచే పోషక గుణాలున్న పశుదానా ను అందుబాటు ధరలోనే పాడి రైతులకు అందించాలని, పశు సంవర్ధకశాఖ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరస్పర సహకారంతో జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికై కోనసీమ పశుధాణా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం,చెల్లూరు గ్రామంలో బుధవారం మండల పరిధిలోని చెల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సమావేశ మందిరంలో కోనసీమ పశుదాణా పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, మండపేట శాసన సభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తొలుత ఎండు గడ్డి వృథా కాకుండా, ఎండు గడ్డిని కట్టలుగా కట్టే బెయిలింగ్ మెషిన్ రైతులకు రాయితీ పై అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ కోనసీమ జిల్లా వ్యాప్తంగా పచ్చిరొట్ట పశుగ్రాస కొరత ఉన్న నేపథ్యంలో పాడి పరిశ్రమ నానాటికి తగ్గిపోతున్న దృష్ట్యా, కొబ్బరి తోటల్లో అంతర పంటగా పశుగ్రాసాన్ని పెంచుకునేందుకు నరేగా అనుసంధానంతో పలు పథకాలను రాయితీ తో అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి తోడు అదనంగా కోనసీమ పశుదాణా పథకాన్ని నేటి నుండి అమల్లోకి తీసుకు రావడం జరిగిందన్నారు. ఇప్పటికే రైతాంగానికి పంట రుణాలు రాయితీలతో కూడిన ఎరువులు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(ప్యాక్స్) ద్వారానే సమగ్రంగా సరఫరా చేయడం జరుగుతుందని అదే కోవలో పలు పశుదాణా సంస్థలతో పలుమార్లు సంప్రదింపులు జరిపి ప్యాక్స్ ద్వారానే పశుదాణా కూడా సరఫరా చేసే విధంగా కసరత్తు చేసి, నేటి నుండి కార్యరూపంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. దీని ద్వారా జిల్లా వ్యాప్తంగా మార్కెట్లో పశుదాణా 50 కేజీల ధర 1300 ఉంటే, అన్ని పోషక విలువలు కలిగిన పశుదాణా ను కేవలం 1000 రూపాయలకే జిల్లా వ్యాప్తంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ పశు దాణా మూలంగా పాడి పశువుల లో పాల దిగుబడి, పశువుల పునరుత్పత్తి సామర్థ్యం మెరుగు పడుతుందన్నారు. ఆరోగ్యకరమైన దూడలు జన్మిస్తాయని, ఏడాదికి ఒక దూడ జన్మించేందుకు ఆస్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పెయ్య దూడలు సకాలంలో ఎదకు వస్తాయని, పశువుల లో రోగనిరోధక శక్తి, పాల ఉత్పత్తి మెరుగుపడి పాలలో వెన్న శాతం పెరుగుతుందన్నారు. మీ సమీప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో సమగ్ర పోషక విలువలు కలిగిన 50 కేజీలు కోనసీమ పశుదాణా బస్తా కేవలం1000 రూపాయలకే లభిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఫాక్స్ కేంద్రాలలో కోనసీమ పశుదాణా సరఫరా అవుతుందని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి, మంచి పోషక విలువలున్న దాణా ను తక్కువ ఖర్చు తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో ప్రప్రథమంగా కోనసీమ జిల్లా లోనే అందిస్తున్నారని, వినూత్నంగా ఆలోచించి ఒక మంచి ఆలోచనను పశు పోషకులకు లాభదాయకంగా ఉండేందుకు ప్రవేశ పెట్టారని హర్షం వ్యక్తం చేసారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ పశు సంవర్ధక శాఖ అధికారులతో, జిల్లాలోని అభ్యుదయ రైతులతో పలు దఫాలుగా చర్చించి ఈ పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. జిల్లాలో పాల దిగుబడి పెంపు దిశగా తొలి అడుగు వేస్తూ జిల్లా కలెక్టర్ చొరవతో అనపర్తి సాయి శివోహం కంపెనీ లాభ, నష్టాల గూర్చి ఆలోచించకుండా కోనసీమ పశువుల దాణా సరఫరాకు అంగీకరించి తొలి విడతగా 5 టన్నులు సరఫరా చేసారని అభినందించారు. ఈ సమీకృత దాణా లో అధిక పోషక విలువలు గల రాగులు, జొన్నలు, విటమిన్ లు, ఖనిజ లవనాలు సమపాళ్ళలో ఉండడంతో పశువుల ఆరోగ్యము, పాల ఉత్పత్తికి తోడ్పడమే కాక, పాడి రైతుకి లాభ సాధనంగా మారి రైతు యొక్క తలసరి ఆదాయం పెంపొందించ బడుతుందని కలెక్టర్ మహేష్ కుమార్ ఆకాంక్ష అన్నారు. పాడి రైతులు శ్రేయస్సు కోసం ఒక మంచి ఆలోచనతో ముందడుగు వేసిన జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు, పశు సంవర్ధక అధికారి డాక్టర్ కె.వెంకటరావు లను స్థానిక కూటమి నాయకులు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చెల్లూరు గ్రామ సర్పంచ్ పాలిక రాఘవ, ఎంపిటిసి గొల్లపల్లి అనురాధ వెంకటరమణ, మాజీ శాసన మండలి సభ్యులు వి.వి.వి చౌదరి (కుర్మాపురం అబ్బు), మండపేట వ్యవసాయ కమిటి చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, రాయవరం మండల పరిషత్ అధ్యక్షులు నౌడు వెంకటరమణ, మాజీ జిల్లా గ్రంధాలయ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి, చెల్లూరు పి.ఎ.సి.ఎస్ చైర్ పర్సన్ దేవల్ల వెంకటరావు, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ కె.వెంకటరావు, పశు సంవర్ధక ఉప సంచాలకులు డాక్టర్ కర్నీడి మూర్తి, రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల, రాయవరం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.అనిత కుమారి, రావులపాలెం, ఆలమూరు, రామచంద్రపురం పశు సంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ ఉమామహేశ్వర రెడ్డి, డాక్టర్ అనిత, డాక్టర్ రామకృష్ణ, పశు వైద్యాధికారులు,పశువైద్య సిబ్బంది, రాయవరం మండల ఎంపీడీఓ కీర్తి స్పందన, తహసీల్దార్ బివి భాస్కర్, మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్ కుమార్, కూటమి నాయకులు చంద్రు వీర్రాజు చౌదరి (రాజు), సీనియర్ నాయకులు దేవు శ్రీను, ఎస్సీ సెల్ నాయకులు దార్ల సుధీర్ బాబు, పలు శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది, అభ్యుదయ రైతులు, పశు పోషకులు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# వాడవాడలా విరాట్ కోహ్లీ జన్మదిన వేడుకలు

### రాయవరం జైభీమ్ యువకుల సంబరాలు




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పదునైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించే పరుగులు యంత్రం భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, కింగ్ కోహ్లీ జన్మదిన వేడుకలను దేశంలో వాడ, వాడలో బుధవారం అభిమానులు కోలాహలంతో జరుపుకున్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో జై భీమ్ యూత్ యువకులు బుధవారం రాత్రి ఆమె అభిమాన ఆటగాడు విరాట్ కోహ్లీ జన్మదినాన్ని పురస్కరించుకుని తీన్మార్ డప్పులు, నృత్యాలతో సందడి చేశారు. కింగ్ కోహ్లీకి జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ కేక్ కటింగ్ చేసి పంచి పెట్టారు. దేశానికి ఎన్నో ప్రతిష్టాత్మక విజయాలను అందించిన వ్యక్తి జన్మదినం పురస్కరించుకోవడం తమకెంతో ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేయగా, యువకులు సంబరాలతో బుధవారం రాత్రి రాయవరం దళిత వాడలో సందడి వాతావరణం నెలకొంది.

# ఇంకా తెగని తిరువూరు తంటా! ఫైనల్ డెసిషన్‌కు చంద్రబాబు రావాల్సిందే..




టీడీపీలో తిరువూరు పంచాయితీకి ఎండ్ కార్డు పడలేదు. పార్టీ ఆదేశాల ప్రకారం మంగళవారం క్రమశిక్షణ కమిటీ ముందుకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఇద్దరిని వేర్వేరుగా విచారించిన క్రమశిక్షణ సంఘం సభ్యులు బుధవారం పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు నివేదిక ఇవ్వనున్నారు. ఆయన పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లి నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరనున్నారు. పార్టీ భావినేత, మంత్రి లోకేశ్ మంగళవారం కేంద్ర పార్టీ కార్యాలయంలోనే ఉన్నప్పటికీ ఇద్దరు నేతలను కలవకపోవడం విశేషం.

తిరువూరు నియోజకవర్గంలో పందెం కోళ్ల మాదిరిగా ఎంపీ, ఎమ్మెల్యే ఘర్షణకు దిగడం వల్ల పార్టీ పరువు బజారున పడుతోందని అధినేత చంద్రబాబు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ పరస్పరం ఆరోపణలు, విమర్శలు చేసుకుంటుండటం వల్ల నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గందరగోళంగా మారింది. అంతేకాకుండా ఈ వివాదంపై కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా సమస్యలు ఎక్కువయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. దీంతో ఇద్దరి నుంచి వివరణ తీసుకోవాల్సిందిగా లండన్ పర్యటనకు ముందు చంద్రబాబు ఆదేశించారు. ఇద్దరి వివరణ పరిశీలించి తాను లండన్ నుంచి రాగానే చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. ఇక చంద్రబాబు గురువారం విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి రానున్నారు. క్రమశిక్షణ సంఘానికి ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి ఏం చెప్పారనేది ఉత్కంఠ రేపుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఇద్దరూ తమ వాదనకే కట్టుబడినట్లు తెలుస్తోంది. ఎంపీ చిన్ని తన నియోజకవర్గ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వరని ప్రచారం చేస్తూ, తన మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నారని ఎమ్మెల్యే కొలికపూడి ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. ఎంపీ శివనాథ్ తిరువూరు రాజకీయాలను పట్టించుకోని పక్షంలో ఆయనతో తనకు ఎలాంటి గొడవ ఉండదని ఎమ్మెల్యే కొలికపూడి స్పష్టం చేసినట్లు కథనాలు వస్తున్నాయి. ఇదే సమయంలో ఎంపీ చిన్న సైతం తన వాదన వినిపించారు. తన పార్లమెంటు పరిధిలో పార్టీ బలోపేతం కోసం తాను పనిచేస్తున్నానని, మిగిలిన నియోజకవర్గాలు మాదిరిగానే తిరువూరులో కూడా పర్యటిస్తున్నట్లు వివరణ ఇచ్చారని అంటున్నారు. పార్టీకి నష్టం కలిగించేలా తాను గీత దాటి వ్యవహరించలేదని ఎంపీ చిన్ని స్పష్టం చేశారని అంటున్నారు. పార్టీ కోసం తాను 2014 నుంచి కష్టపడుతున్నానని, పార్టీ సిద్ధాంతాలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. వ్యక్తిగత అజెండాతో పార్టీని నాశనం చేయాలనుకునే వారి విషయంలో నేనే కఠినంగా ఉండాల్సివస్తోందని వివరణ ఇచ్చారు. తన పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎవరితో విభేదాలు లేవని, ఎవరికైనా తనతో సమస్య ఉంటే తానే ఒక అడుగు దిగి పరిష్కరించుకుంటానని వెల్లడించారు. అంతేకాకుండా చంద్రబాబుకు తాను వీర భక్తుడినని, పార్టీయే తనకు దైవమని మీడియాతో ఎంపీ చిన్ని తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రమశిక్షణ సంఘం సభ్యులు వర్ల రామయ్య, పంచుమర్తి అనూరాధ, కొనకళ్ల నారాయణ, ఎంఏ షరీఫ్ తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి, ఎంపీ చిన్ని నుంచి వివరణ తీసుకున్నారు. ఎమ్మెల్యే కొలికపూడితో సుమారు 4 గంటలపాటు క్రమశిక్షణ సంఘం భేటీ అయింది. ఎంపీపై గతంలో ఆయన చేసిన ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక ఇచ్చారు. కాగా, తనపై పార్టీ అధినేత ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని మీడియాతో స్పష్టం చేశారు. ఇక క్రమశిక్షణ సంఘం విచారణ అనంతరం ఈ ఇద్దరి పంచాయితీకి ఎలాంటి ముగింపు ఉంటుందనే ఆసక్తి పెరిగిపోయింది. ఇద్దరి వ్యవహారశైలిపై ఆగ్రహంగా ఉన్న సీఎం చంద్రబాబు.. ఇద్దరి వివరణలను పరిశీలించి ఎవరిపై వేటు వేస్తారనేది ఉత్కంఠ రేపుతోంది.

# 'విద్యార్థి దశలో సమయం ఎంతో విలువైనది'

### భాష్యం విద్యాసంస్థల చైర్మన్ బి.రామకృష్ణ



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థి దశలో సమయం ఎంతో విలువైనదని ఎక్కువ సమయం చదువుపై దృష్టి పెట్టాలని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ బి.రామకృష్ణ విద్యార్థులకు సూచించారు. అమలాపురం ఎ వన్ ఫంక్షన్ హాల్‌లో కోనసీమ జిల్లా లోని భాష్యం విద్యాసంస్థల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు పది పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులంతా గతేడాది పది ఫలితాల్లో 600 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిన భాష్యం విద్యార్థిని యాళ్ల నేహాంజనిని ఆదర్శంగా తీసుకుని ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం భాష్యం మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌అమ్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి విద్యలో ఉన్నతంగా రాణించి సమాజంలోని కొంత మందికి ఉపాధిని కల్పించే ఎంటర్ప్రెన్యూరర్గా మారాలన్నారు. ఈకార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల ప్రధాన సలహాదారుడు మైఖేల్రాజు, జోనల్ ఇన్చార్జ్ జవ్వాది వెంకట శ్రీనివాస్, 9 శాఖల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# చెకుముకి నందు ఆదిత్య స్కూల్ గొల్లగూడెం విద్యార్థుల ప్రతిభ



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** చెకుముకి నందు ఆదిత్య స్కూల్ గొల్లగూడెం విద్యార్థుల ప్రతిభ ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు మండల స్థాయి పరీక్ష నిర్వహించడం జరిగింది. ఇందులో అమలాపురం అర్బన్, రూరల్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పాల్గొన్నాయి. అమలాపురం అర్బన్ ఆదిత్య హైస్కూల్ గొల్లగూడెం విద్యార్థులు 8వ తరగతి చదువుతున్న వి.గురుచరణ్, 9వ తరగతి చదువుతున్న జి అధితి, 10 వ తరగతి విద్యార్థి టి.ఎస్.ఎస్ కార్తీక్‌లు ప్రథమ స్థాయిలో విజేతలుగా నిలిచి ఈ నవంబర్ 23న జరిగే చెకుముకి జిల్లాస్థాయి సంబరాలకు ఎంపికయ్యారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్‌జశేషారెడ్డి, డైరక్టర్ ఎమ్.శృతిరెడ్డి, ప్రిన్సిపల్ కె.లక్ష్మీదేవి, ఎంపికయిన విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.

### జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన

# రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి కుడిపూడి శ్రీనివాసరావు

**కుడిపూడి శ్రీనివాసరావుకు పూలమాల వేసి శాలువాలతో సత్కరించిన అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి**




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక రావులపాలెం గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం నుండి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా కుడిపూడి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన రావులపాలెం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయం నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జగ్గిరెడ్డి వారిని పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


### స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణను

# సద్వినియోగం చేసుకోవాలి

**రాష్ట్రంలో 935 పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్ యూనిట్లు ఏర్పాటు**

**ఒక్కో యూనిట్ కు 32 మంది విద్యార్థులకు శిక్షణ**

**గైడ్ కెప్టెన్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమ**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి పాఠశాలలో, ముఖ్యంగా పిఎం శ్రీ పాఠశాలల్లో యూనిట్లు ఏర్పాటు చేస్తూ, ది భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని గైడ్ కెప్టెన్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమ పేర్కొన్నారు. రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 3వ తేది నుంచి నిర్వహిస్తున్న గైడ్ కెప్టెన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉమ మాట్లాడుతూ ప్రతి పాఠశాల లోనూ స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. అయితే పీఎంశ్రీ పాఠశాలల్లో మాత్రం తప్పనిసరిగా యూనిట్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని 935 పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్ యూనిట్లు ఏర్పాటు చేశామని, ఒక్కో యూనిట్‌కు ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు మొత్తం 32 మంది విద్యార్థులను తీసుకుంటున్నట్లు తెలిపారు. అకడమిక్ క్యాలండర్ ప్రకారం ప్రతి పీఎంశ్రీ పాఠశాలల్లో తప్పనిసరిగా వారానికి రెండు తరగతులు నిర్వహించాల్సి ఉందన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ అభివృద్ధి చేసేందుకు స్కౌట్ అండ్ గైడ్ ఉపకరిస్తుందన్నారు. కోర్సు కోఆర్డినేటర్ పి.రాంబాబు మాట్లాడుతూ తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన 91 మంది గైడ్ కెప్టెన్స్ ట్రైనింగ్ పొందుతున్నట్లు తెలిపారు. త్వరలోనే పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన పెట్రోలింగ్ లీడర్స్ ట్రైనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా ది భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి జె.రాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కల్పన, ఎంఈవో పి.శ్రీనివాసరాజు, బేసిక్,అడ్వాన్స్ కోర్సుల ఎల్‌వోసీలు సుశీల, రజియా, ట్రైనర్స్ దుర్గామాధవి తదితరులు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక వైభవం.. శ్రీ సత్యదేవుని గిరిప్రదక్షిణం...!









## గిరి చుట్టూ తిరిగే హృదయం సత్యదేవుని నిలయం - సత్యదేవుని గిరి ప్రదక్షిణ సాక్షాత్తు ఆత్మ ప్రదక్షిణే
## 12.15 గంటలకు చినుకులు రాలి తెరపిచ్చిన వైనం - గిరిప్రదక్షిణ భక్తులకు ఆధ్యాత్మిక కనువిందు
## ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే

**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వామి, అమ్మ వార్ల దర్శనం, అనుగ్రహ భాగ్యం కలిగించి, భక్తుల జన్మ జన్మల పాపహరించి, దైవిక ఆశీర్వాదాలను ఇచ్చి, అంతర్గత శాంతిని, ఆధ్యాత్మిక, ఆత్మనిష్ఠను పెంపొందించి, శారీరక వ్యాయామ ప్రయోజనాలను అందించే శ్రీసత్యదేవుని గిరిప్రదక్షిణ ఆధ్యాత్మిక వైభవంగా విరాజిల్లింది. త్రిమూర్తి రూపక దైవం, భక్త సులభుడు, కోర్కెలు నెరవేర్చే దైవంగా అచంచల విశ్వాసాన్ని పెంచుకుని గిరిప్రదక్షిణలో పాల్గొన్న అశేష జనవాహినికి విశేష దర్శనం ఇస్తూ వీర వెంకట సత్యనారాయణస్వామి గిరిప్రదక్షిణ ఆద్యంతం కన్నుల పండుగగా సాగింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి, రమాదేవి గిరిప్రదక్షిణ ఆధ్యాత్మిక వార్షిక యాత్రా కార్యక్రమం బుధవారం కార్తీక శుద్ధ పౌర్ణమి రోజున అత్యంత వైభవంగా జరిగింది. తొలుత దేవస్థానంలో శ్రీస్వామి, అమ్మవార్లను పల్లకీలో సుఖాసీనులను చేసి దేవస్థానంపై ఊరేగిస్తారు. అలా ఊరేగిస్తూ ఉదయం ఉదయం 8.30 గంటల శుభ ముహూర్తపు ఘడియలకు దేవాలయం కొండ దిగువన ఉన్న తొలి పావంచా వద్దకు పల్లకీలో తీసుకుని వచ్చారు. వేద పండితులు, దైవికులు ఇక్కడ వైదిక కార్యక్రమాలు, పూజాదికాలను, ప్రత్యక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేలాది సుగంధ, పరిమళ పుష్పాలతో సద్బ్రాహ్మణులు ప్రత్యేకంగా అలంకరించి తీర్చిదిద్దన మోటారు వాహన సత్యరథంలో శ్రీ స్వామిని, ఇష్ట సఖి ఆద్యాది మహాలక్ష్మిని అత్యంత భక్తి శ్రద్ధలతో సుఖాసీనులు చేసారు. అనంతరం తొలి పావంచా నుంచే మధ్యాహ్నం 2 గంటలకు సత్యరథం గిరిప్రదక్షిణ యాత్ర అధికారికంగా ప్రారంభమైంది. ఇక్కడ నుంచే సత్య రథం వెంట వేద పండితులు, పురోహితులు, ఆలయ సిబ్బంది, అశేష భక్త జన సంద్రం వెంట తరలి రాగా సకల శోభాయమానంగా మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో, తప్పెట్లు, తాళాలు, డప్పులు, రుంజ వాయిద్యాల శబ్ద విన్యాసాల నడుమ, స్వామి నామస్మరణతో అశేష జనవాహిని రథాన్ని అనుసరించింది. అన్నవరం గ్రామ ప్రధాన రహదారిలో జాతీయ రహదారిలోని గ్రామ ముఖద్వారం వద్ద స్వాగత మండపం మీదుగా పడమర దిశన బెండపూడి వైపుగా గిరిప్రదక్షిణ కొనసాగింది. దారి పొడవునా స్వామి అమ్మ వార్లకు జయజయ నాదాలు పలుకుతూ సత్యరథానికి ముందు కొంత, వెనుక కొంత జనసమూహాలు తమ పాదాలు కదిపాయి. అలా అలా బెండపూడి సమీపంలోని పోలవరం గట్టు మార్గం, సత్యగిరి మీదుగా అన్నవరం వైపు కొండల తట్టు ప్రాంతాల మీదుగా గిరిప్రదక్షిణ యాత్ర పయనించింది. వేద పండిత అగ్రేసరుల నియమాల అనుసారం భక్తి,విజ్ఞాన, వినోద మనో రంజకంగా ఆసక్తికరంగా, నయన మనోహరంగా, వీనుల విందుగా గిరి ప్రదక్షిణ సజావుగా వేడుకగా ముందుకు కొనసాగింది. ఇలా రత్న, సత్యగిరుల చుట్టూ గిరిప్రదక్షిణ మార్గం 9.2 కిలో మీటర్ల మేర దూరం పొడవునా సుమారు 4 గంటల సమయం పాటు పైగా సాగిన యాత్ర ఆద్యంతం స్వామి, అమ్మ వార్లు స్వీయ గిరి ప్రదక్షిణం చేస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు తమ పాదరక్షలను విడిచి పాదయాత్రగా అనుసరించారు. చివరకు స్వామి, అమ్మ వార్లు దేవస్థానంపై స్వస్థానానికి చేరుకున్నాక స్వామి అమ్మ వార్లకు వేద పండితులు మంగళ హారతులు ఇచ్చారు. తదుపరి స్వామి అమ్మ వార్లను యధావిధిగా గర్భగుడిలో ప్రవేశ పెట్టడంతో గిరి ప్రదక్షిణ యాత్రా దైవ కార్యం ఫలప్రదంగా పరిపూర్ణం అయ్యింది. ఏదైనా పని తలపెట్టి నప్పుడు సత్యనారాయణ వ్రతం ఆచరిస్తే అనితర సాధ్యమైన మనోబలం సొంతం అవుతుందని చెబుతారు. కార్తిక మాసంలో త్రిమూర్తుల అభేదానుభవాన్నిచ్చే మీసాలరాయుని దర్శనం చాలా మంచిదని నమ్మకం. అందువల్ల అన్నవరం రత్నగిరి ప్రదక్షిణ అత్యంత ప్రసిద్ధమైంది కావడంతో అశేష భక్త కోటి ఈ కార్తిక పౌర్ణమి గిరి ప్రదక్షిణలో భాగస్వామ్యమై తరించింది. గిరి ప్రదక్షిణలో పాల్గోడం వలన కొండపై వెలసిన దేవతామూర్తుల శక్తిని పొందగలుగుతామని చెబుతారు. కొండంతా నిండిన అనేక ఔషధ వృక్షాలు సాధకుడికి ఆరోగ్యభాగ్యాన్నీ, శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసం, శక్తి, జ్ఞానం, ఆనందం ప్రదక్షిణతో లభిస్తాయని భక్తుల నమ్మకం. అన్నవరం గిరి ప్రదక్షిణ అశ్వమేధ యాగ ఫలాన్నిస్తుందని ఆధ్యాత్మికవేత్తలు విశ్వాసం. అందుకే సత్యదేవుని గిరిప్రదక్షిణలో ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు అత్యంత నియమనిష్టలతో, విశ్వాసంతో భాగస్వామ్యమై తరించారు.

## గిరిప్రదక్షిణ భక్తులకు
# నాగేశ్వరరావు మజ్జిగ వితరణ



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వట్ట మాటలు కట్టిపెట్టి గట్టి మేల్ తలపెట్టవోయ్... అన్న సామాజిక ఉద్యమ మహాకవి గురజాడ అప్పారావు అన్ని మాటలను విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ నాయకుడు గొర్లి నాగేశ్వరావు నిజం చేస్తున్నారు. కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ స్ఫూర్తితో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ వరవడిలో కార్తీక మాసం క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా నిండు పౌర్ణమి బుధవారం శ్రీసత్యదేవుని గిరి ప్రదక్షిణ సందర్భంగా సత్యదేవుని రథం వెంట పాదయాత్రగా వచ్చిన వందలాది మంది భక్తులకు శ్రేష్టమైన మజ్జిగను పంపిణీ చేసారు. శంఖవరం మండలం అన్నవరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంనకు వెళ్ళే ముఖద్వారం సమీపంలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న రెడ్డి వేయింగ్ బ్రిడ్జి ముందు సత్యదేవుని గిరి ప్రదక్షిణ పాదయాత్రికులకు గొర్లి నాగేశ్వరరావు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల కార్యదర్శి నల్లల రామకృష్ణ, కాకినాడ జిల్లా పార్లమెంటరీ కమిటి సభ్యులు గౌతు లక్ష్మి సంయుక్తంగా రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. భక్తులకు ఈ ఇరువురు నేతలు, గొర్లి నాగేశ్వరరావు స్వయంగా పంపిణీ చేశారు. అల్లం, కరివేపాకు, పచ్చిమిర్చి, కొత్తిమీర, నిమ్మరసం, మంచు గడ్డలు కలిపిన చల్లటి మసాలా మజ్జిగను భక్తులు అందరికీ పిలిచి పిలిచి మరీ అందించారు. ఈ మజ్జిగ శిబిరానికి ముందు కొద్ది దూరంలో దాడిశెట్టి నర్సయ్య శ్రీధనలక్ష్మి జ్యూవెలరీ సంస్థ పులిహోర వితరణ శిబిరంలో పులిహోరను పంపిణీ చేయడం, అక్కడ కనీసం తాగునీటి సదుపాయం లేకపోవడంతో గొర్లి నాగేశ్వరరావు మజ్జిగ శిబిరం మంచి ఉపశమనంగా ఉపయోగపడడంతో ఇక్కడ మజ్జిగను సేవించేందుకు భక్తుల తాకిడి పెరిగింది. సత్య రథం ఈ మజ్జిగ శిబిరాన్ని దాటుకుని వెళ్ళిన మధ్యాహ్నం మూడు గంటల సమయం వరకూ నిరాఘాటంగా శ్రేష్టమైన మజ్జిగను పంపిణీ చేశారు. తొలుత రూ. 30,000 వ్యయంతో ఈ మజ్జిగ శిబిరాన్ని నిర్వహించాలని తలంచి ప్రణాళికాబద్ధంగా 20 మంది సహాయకుల సభ్యుల బృందంతో ఏర్పాటు చేసాక భక్తుల రద్దీకి అనుగుణంగా భక్తుల దిహార్తి తీర్చడమే ప్రధాన లక్ష్యంతో అదనంగా మజ్జిగను పంపిణీ చేయడంతో వ్యయం అంచనాలను మించింది. ఈ కార్యక్రమాల్లో కాకినాడ జిల్లా టెలి కమ్యూనికేషన్ సలహా మండలి సభ్యులు మేకల కృష్ణ, జనసేన పార్టీ పార్లమెంటరీ కమిటి సభ్యులు రావూరి వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు నియోజకవర్గం ఐటి కోఆర్డినేటర్ సత్యంశెట్టి రాజేష్, సీనియర్ నాయకులు వేల్పుల నరసింహమూర్తి, మండపం జనసేన నాయకులు పోలం వెంకటరత్నం, చాగంటి అప్పారావు, పరిసిన శివ, రాయి రామకృష్ణ, కలవలపల్లి వెంకటేష్, బొడ్డు అప్పలరాజు, కడిగట్ల పెంటయ్య, వట్టి కోళ్ల దొరబాబు, మరపరెడ్డి హరీష్, పులపర్తి వేణు, మెరక చామవరం అర్జున, వంశీ, ఉత్తరకంచి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# లావాదేవీలు జరగని బ్యాంక్ ఖాతాలోని సొమ్మును తిరిగి పొందండి : కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** “మీ డబ్బు - మీ హక్కు” నినాదంతో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమంపై రూపొందించిన గోడ పత్రికను బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. బ్యాంకు అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ 10 ఏళ్ళు అంతకు మించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో సొమ్మును బ్యాంకులు తిరిగి ఇచ్చేయడం జరుగుతుందన్నారు. “మీ డబ్బు - మీ హక్కు” నినాదంతో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం ద్వారా పౌరులు తమ పేరు మీద ఉన్న క్లెయిమ్ చేయని లేదా మరిచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం కల్పించిందన్నారు. ప్రజలు బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా పాలసీలు, ఇతర ఆర్థిక సాధనాలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా తమ కుటుంబ భవిష్యత్తును సురక్షితం చేసుకుంటున్నారని, కొన్ని సందర్భాల్లో ఈ ఆస్తులు లబ్ధిదారులకు చేరకపోవడానికి ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు లేదా నామిని వివరాల లోపం వంటి కారణాలు ఉన్నాయన్నారు. “మీ డబ్బు - మీ హక్కు” ప్రచార కార్యక్రమం ద్వారా పౌరులు తమ పేరు మీద ఉన్న క్లెయిమ్ చేయని నిధులను గుర్తించి సరైన పత్రాలు సమర్పించడం ద్వారా సులభంగా క్లెయిమ్ చేసుకోవడానికి ఆర్బీఐ అవకాశం కల్పిస్తోందని ఆయన తెలిపారు. ఆర్బీఐ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలన్నారు. ఈ విధంగా కాకినాడ జిల్లాలో 5,72,938 వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో రూ.83.36 కోట్లు, 10048 వివిధ సంస్థల బ్యాంకు ఖాతాల్లో రూ.12.60 కోట్లు, 5,535 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బ్యాంకు ఖాతాల్లో రూ.5.26 కోట్లు ఇలా మొత్తం 5,88,521 బ్యాంకు ఖాతాల్లో రూ.101.22 కోట్లు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వీటికి సంబంధించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు సరైన ధ్రువపత్రాలతో ఈకేవైసీ పూర్తి చేసి, తమ సొమ్మును తిరిగి పొందవచ్చని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు అధికారి సీహెచ్ఎస్వీ. ప్రసాద్ ఇతర బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కాకినాడలో ఘనంగా జరిగాయి. బుధవారం సాయంత్రం స్థానిక చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారుల మధ్య వార్షికోత్సవ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నపిల్లలతో ఫెడరేషన్ నాయకులు కేక్ కటింగ్ చేయించారు. అనంతరం పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు అందజేసారు. ఈ సందర్భంగా జరిగిన ఆవిర్భావ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్‌లు మాట్లాడుతూ గడచిన 19 ఏళ్ల కాలంలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల కోసం అనేక పోరాటాలు జరిగాయన్నారు. ఇదే సందర్భంలో పలు విజయాలు కూడా సాధించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తూ జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం ఫెడరేషన్ పనిచేస్తుందని తెలిపారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, ఇళ్ళు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని, వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని ఇలా అనేక డిమాండ్ల సాధనకు ఫెడరేషన్ ఉద్యమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గునిపే శోభన్ బాబు, మీడియా సెక్రటరీ పుర్రె త్రినాథ్, ట్రెజరర్ రామకృష్ణ, సహాయ కార్యదర్శులు కే.సత్య, వి.నానాజీ, సీనియర్ సభ్యులు బాబూరావు, చేయూత సంస్థ రవి కుమార్, సెక్రటరీ అలీమ్, సీనియర్ సభ్యులు సుబ్బారావు, చింతా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# హాకీ శతజయంతి ఉత్సావాల గోడపత్రిక ఆవిష్కరణ



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** హాకీ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన గోడ పత్రికను బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిగా వి.సతీశ్, హాకీ ఆంధ్ర ప్రదేశ్ కాకినాడ జిల్లా జాయింట్ సెక్రెటరీ వి.రవిరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. హాకీ శత జయంతి ఉత్సవాలు సందర్భంగా దేశం నలుమూలల ప్రతి జిల్లాలో నవంబర్ 7వ తేదీన ఒక మెన్ హాకీ మ్యాచ్, ఒక ఉమెన్ ఓకే మ్యాచ్ జరిగే విధంగా హాకీ ఇండియా అన్ని రాష్ట్రాల హాకీ సంఘాలకు నిర్దేశించిందని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిగా వి. సతీష్, హాకీ ఆంధ్ర ప్రదేశ్ జాయింట్ సెక్రెటరీ రవిరాజు తెలిపారు. దానిలో భాగంగా హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో హాకీ మ్యాచులు జరుగుతాయన్నారు. దానిలో భాగంగా కాకినాడ జిల్లాలో జిల్లా క్రీడా మండల మైదానం, కాకినాడ లో ఉన్న ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ లో ఈ నెల 7న ఉదయం ఏడు గంటలకు సీనియర్ మహిళలు పురుషుల హాకీ పోటీలు ప్రారంభమవుతాయని, ఏడో తేదీ సాయంత్రం ఐదు గంటలకు ఫ్లడ్ లైట్స్ లో సీనియర్ హాకీ క్రీడాకారులు, సూపర్ సీనియర్ హాకీ క్రీడాకారులుతో కలిపి ఒక మ్యాచ్ జరుగుతుందన్నారు. కావున సీనియర్ హాకీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, హాకీ కుటుంబ సభ్యులు అందరూ ఉదయం సాయంత్రం కూడా హాకీ 100 సంవత్సరాల ఉత్సవాల్లో పాల్గొన వలసిందిగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.



# పేదవారికి సీఎం సహాయనిధి భరోసా

## వైద్య ఖర్చులకు సహాయం - ప్రతీ కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకం
## 2014-19లో రూ.12 కోట్ల సీఎం సహాయనిధులు : ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి రూరల్ నియోజక వర్గం పరిధిలో సీఎం సహాయ నిధులు విడుదల చెయ్యడం ద్వారా 15 మంది లబ్ధిదారులకు రూ.11.89 లక్షల చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం రూ.11.89 లక్షల విలువైన చెక్కులు 15మంది లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ వైద్య ఖర్చులు భారమైన పేదవారికి కొండంత భరోసాగా, మానవతా దృక్పథంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలుస్తున్నారని పేర్కొన్నారు. "ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ, విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలో లేని అనేక రకాల చికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఇబ్బంది పడుతున్న పేద, మధ్యతరగతి కుటుం బాలకు సీఎం సహాయనిధి భరోసాగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయల వైద్య ఖర్చులు నిమిత్తం సహాయాన్ని మన సీఎం చంద్రబాబు నాయుడు ఉదారంగా అందిస్తున్నారన్నారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల కాలంలో 226 మంది లబ్ధిదారులకు రూ.2,56,77,183 విలువైన చెక్కులు సీఎం సహాయనిధి ద్వారా అందించామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే, 2014-19 మధ్య కాలంలో సుమారు రూ.12 కోట్ల సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించామని చెప్పారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షల వరకు ఇన్సూరెన్స్ పథకం ఈ ఏడాది నుంచి అమలులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధులు మంజూరులో ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా, నేరుగా తన కార్యాలయం ద్వారా పారదర్శకంగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని గోరంట్ల వివరించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన ఇస్సకోటి సత్య వినీత్‌కు రూ.80,000, గుమ్మడి జార్జికి రూ.50,000, దీప్తి మహంతి యమినికి రూ.75,833, ఆచంట హరి బాబుకు రూ.1,01,923, బాలి మణికంఠకు రూ.1,66,808, పలివెల రామలక్ష్మికి రూ.49,492, మల్లంపల్లి పద్మావతికి రూ.25,000, కడవల దుర్గ ప్రకాష్ కుమారుకు రూ.38,180, పిట్ట కన్నారెడ్డికి రూ.36,759, ఎలుగంటి హర్షవర్ధన్ (C/O ఎలుగంటి సత్యశ్రీ రేవతి)కు రూ.40,000, చిరుకూరి సూర్య సాయికి రూ.50,000, సీలం చిన్నికి రూ.35,392, దండముడి బ్రహ్మాజీకి రూ.90,000, తంగరాజు కుమారస్వామికి రూ.2,50,000, తూతిక త్రిమూర్తులు 1,00,000 సహాయం మంజూరైంది. మొత్తం రూ.11,89,387 విలువైన చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, చక్కపల్లి మురళీకృష్ణ, శీలం గోవిందు,మట్ట శ్రీను,బొప్పన శ్రీను, ఉండవెల్లి బంగారు రాజు,దండమూడి తేజ, నిచ్చని కోళ్ల సత్తిబాబు, ఎమ్మెస్సార్ శ్రీను,పెంకె కోటేశ్వరం –వు, అంబటి శ్రీను,బత్తుల వాసు, సర్వారాయుడు తదితరులు పాల్గొన్నారు.

### చదువులో ఒత్తిడి తట్టుకోలేక

# యువకుడు ఆత్మహత్య

## ప్రైవేట్ కాలేజీల ర్యాంకుల టార్గెట్‌కు విద్యార్థి బలి
## తిరుమల విద్యా సంస్థల్లో కొనసాగుతున్న విద్యార్థుల మరణ మృదంగం





**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రైవేట్ కాలేజీల ర్యాంకుల టార్గెట్లకు విద్యార్థులు బలి అవుతున్నారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల పాలిట యమకింకరుల తయారవుతున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థులు నిర్బంధ చదువుల ఒత్తిడిని తట్టుకోలేక బలవంతం మరణానికి పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటన రాజమహేంద్రవరంలో చోటు చేసుకుంది. రాజానగరం పోలిస్ స్టేషన్ పరిధిలోని తొర్రేడు,తిరుమల కాలేజ్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎల్ల సత్యదేవకుమార్ కాలేజీ యాజమాన్యం పెడుతున్న ఇబ్బందులు, వేధింపులకు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం, చెందుర్తి గ్రామానికి చెందిన ఎల్లా సత్యదేవకుమార్ మంగళవారం విద్యార్థి హాస్టల్ రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం హాస్టల్ లో విద్యార్థి తండ్రి దింపి వెళ్ళాడు.కాలేజీ హాస్టల్ సౌకర్యాలతో పాటు వేధింపులు తట్టుకోలేక హాస్టల్లో ఉండను ఇంటి నుండి వచ్చి చదువుకుంటానని తండ్రి వద్ద మారాం చేశాడు. కుమారుడికి సర్ది చెప్పి తండ్రి వెళ్లిన అనంతరం విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థిని హుటహుటిన ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించినప్పటికి పరిస్థితి విషమించడంతో సత్యదేవకుమార్ మృతి చెందాడు.తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రాజానగరం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**మీడియా ప్రతినిధులపై కాలేజీ యాజమాన్యం దౌర్జన్యం**

తిరుమల కాలేజీ విద్యార్థి మృతి సంఘటనను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై కాలేజీ యాజమాన్యం దౌర్జన్యానికి పాల్పడింది. ప్రభుత్వాసుపత్రి మార్చురీ వద్ద కు వెళ్లిన మీడియా ప్రతినిధులపై కాలేజీ యాజమాన్యానికి చెందిన వ్యక్తి రెచ్చిపోయి దుర్భాషలాడాడు. అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెందిన విద్యార్థి వివరాలకు సేకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధుల పై విద్యా సంస్థల చైర్మన్ తమ్ముడు బూతుల పురాణం అందుకున్నాడు . ఏం పీక్కుంటారో పీక్కోండి అంటూ పెద్ద పెద్ద కేకలు వేయడంతో ఏం చేయాలో పాలు పోక పాత్రికేయ మిత్రులు వెనుతిరిగారు.

# సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆదిత్య వాలంటీర్లు సేవలు

## విద్యార్థులు పున్నమి దీపాలంకరణలు






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక గౌతమి ఘాట్ మరియు సరస్వతి ఘాట్లలో ఆదిత్య మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల చెందిన 100 మంది ఎన్.ఎస్.ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు బుధవారం గోదావరి తీరాన గౌతమి ఘాట్లో 70 మంది ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు శివలింగం, సరస్వతీబొమ్మ,దీపాలు, నందీశ్వరుని బొమ్మ, ఓంకారం, శ్రీకారం, వంటి అనేక చిత్రాలతో దీపాలను అలంకరించడం విశేషం. తదుపరి సరస్వతి ఘాట్లో 30 మంది యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు అనేక చిత్రాలతో దీపాలలో వత్తులు,వేసి నూనె పోసి, భక్తులకు పున్నమి వెలుగులకై సిద్ధం చేశారు. సరస్వతి ఘాట్ కమిటీ అధ్యక్షుడు తోట సుబ్బారావు మరియు వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సేవలు అందించిన ఆదిత్య వాలంటీర్లను ప్రతి ఏడాది ఈ విధంగా సేవలు చేస్తున్నందుకు పలువురు అభినందించారు. గోదావరి తీరాన చంద్రుని పూజకు సిద్ధం చేసిన దివ్వెలను అత్యంత సుందరంగా చిత్రాలలో తీర్చిదిద్దారు. ప్రతి సంవత్సరం సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆదిత్య వాలంటీర్లు తమ సహకారం అందజేస్తున్నారని ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి చెప్పారు. ఎన్.ఎస్.ఎస్. డీన్ మరియు యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వి.ఎస్. నాగేశ్వరరావు ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ బిహెచ్.వి.రమాదేవి,పోలుకొండ సాయి, ఆకుల శిరీష, యానిమేషన్ విమల లను అక్కడికి వచ్చిన భక్తులు అభినందించారు. వాలంటీర్లతో పాటు ఎంతో ఆత్మీయంగా ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు కూడా పాల్గొని జయప్రదం చేసినందుకు ప్రిన్సిపాల్స్ సిహెచ్. ఫణికుమార్, ఎస్.కె.ఎన్ రెహమాన్, ఎం.చంద్రశేఖర్, డి.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ ఆనంద్, ప్రసాద్ తదితరులు తమ అభినందనలు తెలియజేశారు.

### ఓఎన్జీసీ సహకారంతో

# మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ





**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం మండలం కొండగుంటూరు గ్రామంలో ఓఎన్‌జిసి సహకారంతో కొమ్ము సత్తిబాబు ఆద్వర్యం లో మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఓఎన్జిసి జనరల్ మేనేజర్ కొమ్ము సత్యనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మా సంస్థ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు స్వయం ఉపాధి చేయూత నివ్వాలని పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. మేము చేస్తున్న కార్యక్రమాలు మీ కోసం మీ ఆర్థిక అభివృద్ధి కోసం మా వంతు మేము నిర్వహిస్తున్నాము మీకు నెలరోజుల పాటు ట్రైనింగ్ ఇచ్చి ఈ కుట్టుమిషన్లను మీకు ఇస్తున్నాము ఈ మిషన్లు ఎవరు అమ్ముకోవద్దు మీరు సద్వినియోగం చేసుకుంటే మీ కుటుంబ సహకారానికి తోడౌతాయన్నారు. ఈ కార్యక్రమం గ్రామ నాయకులు ఏఎంసి డైరెక్టర్ పెమ్మనబోయిన వెంకటేష్, జనసేన ఇంచార్జ్ అరిగెల రామకృష్ణ,జనసేన నాయకులు పెంటగట్ల రాజబాబు,టిడిపి గ్రామ ప్రెసిడెంట్ పెమ్మనబోయిన కోటిబాబు,మాజీ సర్పంచ్ పల్లేటి వెంకటలక్ష్మి వెంకట్రావు,కొత్తపల్లి రఘు, పెంటగట్ల మణికంఠ, మల్లంపల్లి వీరవెంకట రమణ,యార్లగడ్డ శ్రీనువాస్ ,పల్లేటి శ్రీనువాస్, యార్లగడ్డ నరేష్,కొమ్ము రాజేష్,పలువురు పాల్గొన్నారు.

### శ్రీకుటేశ్వరస్వామిని దర్శించుకున్న

# మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలో వెలసిన శ్రీకుటేశ్వరస్వామి ఆలయాన్ని అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు, భక్తులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం దంపతులకు జ్ఞాపికను అందజేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షులు పడాల దుర్గారెడ్డి (ఆర్.కె.) ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి పడిపూజ కార్యక్రమంలో డాక్టర్ సత్తి సూర్యనారాయణ పాల్గొన్నారు. గురుస్వాములను డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి దంపతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ చిర్ల వీర వెంకట రెడ్డి (రమణ), మండల మహిళా అధ్యక్షురాలు మండ సూరెడ్డి సుజాత, తేతల వెంకట రెడ్డి రుక్మిణి, సత్తి రాజశేఖర్ రెడ్డి (జమ్మి), పులగం వీర్రెడ్డి,గొలుగూరి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గోరంట్ల..

## ఆర్థిక ఒడిదుడుకులను అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు
## 20వ వార్డు నందు 9 లక్షల రూపాయలతో డ్రైనేజ్ అభివృద్ధి పనులు



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థిక ఒడిదుడుకులను అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక 20వ వార్డు నందు 9 లక్షల రూపాయల తో నూతనంగా నిర్మించే డ్రైనేజీకి శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ వార్డుల్లో అనేక సీ.సీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాల్సిన అవసరం ఉందని, పనులన్నీ పూర్తి చేసి జీరో వర్క్ వార్డులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సమర్థవంతంగా ముందుకు తీసుకు వెళుతున్నారని అన్నారు. రోడ్లు, డ్రైనేజీలు ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటన్నిటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.సత్యనారాయణ, వై.మోహన్ కృష్ణ, శీలం గోవింద్, నిమ్మలపూడి గోవింద్, కొప్పిశెట్టి చిన్ని, కక్కల రమేష్, చిట్టిబోయిన శ్రీనివాస్, ఏడాకుల వెంకటేశ్వరరావు, కుంచె హనుమంతరావు, నరసింహమూర్తి, చలమూరి సత్యనారాయణ, సింగవరపు సత్య నారాయణ, కేత అప్పారావు, పాలిక వెంకటరమణ, వాసు, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ హయాంలో రైతులకు సకాలంలో ఇన్పుట్ సబ్సిడీ

## స్థానిక కూటమి నేతలు సూచించిన వారికే నష్ట పరిహారం...
## రైతులు ఆందోళన - అన్నదాతలకు కూటమి సర్కార్ వెన్నుపోటు
## మోంథా తుఫాన్ బీభత్సంతో అనపర్తిలోని పలు ప్రాంతాల్లో పంటలు నష్టం



**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులు కష్టాల్లో ఉంటే ముఖ్యమంత్రి లండన్‌లో, ఆయన కుమారుడు ముంబైలో షికార్లు చేస్తూ కాలక్షేపం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పెదపూడి మండలం శహాపురం గ్రామాన్ని సందర్శించి తుఫాన్ ప్రభావిత పంటలను పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునీ వారికి ధైర్యం చెబుతూ తక్షణ నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో ఇన్పుట్ సబ్సిడీ అందించేవారని గుర్తుచేశారు. తుఫాన్ ప్రభావిత రైతులకు తక్షణం నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# అమెరికా గడ్డమీద - ఓ సోషలిస్టు విజయం




న్యూయార్క్ మేయర్‌గా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మజ్దానీ గెలుపు. ట్రంప్‌కు ఎదురుదెబ్బ అన్ని ఒత్తిళ్ళు ఎదుర్కొని చారిత్రాత్మక తీర్పునిచ్చిన న్యూయార్క్ ప్రజలకు అభినందనలు కార్యక్రమం నేడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో జరిగింది.

ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న నగరాల్లో

# హైదరాబాద్, విజయవాడ.. కారణమేంటి?



గుజరాత్‌లోని సూరత్ అగ్రస్థానంలో నిలిచింది. 2035 నాటికి ఈ నగరం జీడిపి 126.8 బిలియన్లు చేరనున్నట్లు అంచనా. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ విడుదల చేసిన తాజా నివేదిక (2019-2035) ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో భారత్ అద్భుతమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ జాబితాలో టాప్ 10 నగరాలన్నీ భారతదేశానివే కావడం విశేషం. వీటిలో చాలావరకు టైర్-2, టైర్-3 నగరాలు ఉండటం భారత ఆర్థిక ప్రగతిలో అద్భుతమైన ఉత్సాహాన్ని సూచిస్తోంది.

**టాప్ 3:** సూరత్, ఆగ్రా, బెంగళూరు గుజరాత్‌లోని సూరత్ అగ్రస్థానంలో నిలిచింది. 2035 నాటికి ఈ నగరం జీడిపి126.8 బిలియన్లు చేరనున్నట్లు అంచనా. రెండో స్థానంలో ఆగ్రా ఉంది. మూడో స్థానంలో ఐటీ హబ్ అయిన బెంగళూరు ఉంది. ఈ నగరానికి 8.5% వృద్ధి రేటు ఉండనుంది.

**తెలుగు నగరాల జోరు:** హైదరాబాద్, విజయవాడ తెలంగాణ రాజధాని హైదరాబాద్ అగ్రశ్రేణి నగరాల్లో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. దీని వృద్ధి రేటు: 8.2% 2035 నాటికి అంచనా 201.4 బిలియన్లుగా ఉండనుంది. ఈ అంచనా హైదరాబాద్‌ను ప్రపంచ వ్యాపార రంగంలో కీలక ఆటగాడిగా నిలబెట్టే దిశగా ఉందని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ టాప్-10 జాబితాను పూర్తి చేస్తూ పదో స్థానంలో నిలిచింది. దీని వృద్ధి రేటు 8.2%. 2035 నాటికి జీడిపి అంచనా 21.3 బిలియన్లుగా ఉంది. 2018లో కేవలం 5.6 బిలియన్ల వద్ద ఉన్న విజయవాడ ఆర్థిక పరిమాణం, 2035 నాటికి దాదాపు నాలుగింతలు పెరగనుంది. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మౌలిక సదుపాయాల విస్తరణ, పెట్టుబడుల పెరుగుదలకు నిదర్శనం. లి జాబితాలో ఇతర భారతీయ నగరాలు తదుపరి స్థానాల్లో నాగ్‌పూర్, తిరుప్పూర్, రాజ్‌కోట్ ఉన్నాయి. తమిళనాడులోని తిరుచిరాపల్లి (8.3% వృద్ధి) ఎనిమిదో స్థానంలో ఉంది.. చెన్నై (8.2% వృద్ధి) తొమ్మిదో స్థానంలో నిలిచాయి. ఇది తమిళనాడులోని చిన్న నగరాలు కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సూచిస్తోంది. లి తెలుగు రాష్ట్రాలకు గర్వకారణం ఈ జాబితాలో హైదరాబాద్, విజయవాడ రెండు నగరాలు చోటు దక్కించుకోవడం తెలుగు ప్రజలకు గర్వకారణం. రెండు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ దేశ ఆర్థిక భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా వేగంగా ముందుకు సాగుతున్నాయని ఈ నివేదిక స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ వృద్ధి భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తిని అందిస్తోంది.

# ముగ్గురు ఇన్.. ముగ్గురు అవుట్...

### జూబ్లీ ఎన్నిక తరువాత భారీ మార్పులు..?



తెలంగాణాలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో భారీ మార్పులు ఉంటాయా అన్న చర్చ అయితే సాగుతోంది. ఎందుకంటే ఆల్ ఆఫ్ సడెన్‌గా అజారుద్దీన్ మంత్రి అయిపోయారు. ఏ సభలోనూ సభ్యుడు కానీ అజరుద్దీన్ కి మినిస్టర్ యోగం పట్టడం వెనక హై కమాండ్ ఆదేశాలు ఉన్నాయని అంటున్నారు. ఇపుడు కూడా హైకమాండ్ మరో ప్రయోగానికి తెర తీస్తోంది అని అంటున్నారు మంత్రుల పనితీరుని అంచనా వేయడంతో పాటు విమర్శలు ఆరోపణలు ఉన్న వారి విషయంలో ఒకింత సీరియస్ గా ఉండే చాన్స్ ఉందిట. అలాగే మరికొందరికి అవకాశం ఇవ్వడం ద్వారా రెండేళ్ళు పూర్తి చేసుకోబోతున్న రేవంత్ కేబినెట్‌కి కొత్త రూపు ఇవ్వాలని భావిస్తోంది అని ప్రచారం అయితే సాగుతోంది.

**ఇన్ అయ్యేది ఆమె :** విజయశాంతి తెలంగాణా కాంగ్రెస్‌లో కీలక నాయకురాలిగా ఉన్నారు. ఆమె ఎమ్మెల్సీగా కూడా ఆ మధ్య నామినేట్ చేయబడ్డారు. అది అనూహ్యమైన నిర్ణయం. హైకమాండ్ ఆమె పేరు చేర్చింది అన్న ప్రచారం ఉంది. ఇప్పటికీ హైకమాండ్ ఆశీస్సులు ఆమెకు నిండుగా ఉన్నాయని చెబుతున్నారు బీసీ సామాజిక వర్గానికి చెందిన ఫైర్ బ్రాండ్ గా ఆమె సేవలను వాడుకోవాలని హైకమాండ్ ఆలోచిస్తోంది అని అంటున్నారు. అంతే కాదు ఆమె సినీ గ్లామర్ పాపులారిటీ కూడా కాంగ్రెస్ ని మరింతగా పెంచేందుకు దోహదపడతాయని భావిస్తున్నారుట. దాంతో ఆమె పేరు అయితే కొత్త మంత్రుల జాబితాలో గట్టిగా వినిపిస్తోంది అని అంటున్నారు.

**ఆయనకూ చాన్స్ :** అదే విధంగా పీసీసీ చీఫ్ మహేష్ గౌండ్ కి సైతం మంత్రి పదవి దక్కుతుందని అంటున్నారు. ఆయన కీలకమైన బీసీ నేతగా ఉన్నారు. ఇదే తీరున బాలూ నాయక్ కి సైతం బెర్త్ దక్కవచ్చునని అంటున్నారు. మంత్రి వర్గంలో రెండు ఖాళీలు ఉన్నాయని చెబుతున్నారు. దాంతో ఈ ముగ్గురినీ కొత్తగా తీసుకుంటారని అంటున్నారు. అదే విధంగా ప్రస్తుతం ఉన్న వారిలో ముగ్గురి మీద వేటు తప్పదని అంటున్నారు. పొన్నం సురేఖ కోమటిరెడ్డి అవుట్ : బీసీ మంత్రులుగా ఉన్న ఇద్దరు కీలక నేతలకు పదవీ గండం ఉందని అంటున్నారు. వారిలో పొన్నం ప్రభాకర్ అలాగే కొండా సురేఖ ఉన్నారని ప్రచారం సాగుతోంది. ఇందులో పొన్నం కి పీసీసీ చీఫ్ గా అవకాశం ఇస్తే సురేఖను పూర్తిగా పక్కన పెడతారు అని అంటున్నారు. అలాగే నల్గొండకు చెందిన కోమటిరెడ్డి వెంకట రెడ్డి మీద వేటు పడుతుందని అంటున్నారు. అంటే ముగ్గురు ఇన్ ముగ్గురు అవుట్ అన్న మాట.

**ప్రభుత్వం ఫోకస్ పెరగాలి :** రెండేళ్ళకు దగ్గర పడుతున్న కాంగ్రెస్ మంత్రి వర్గంలో సరైన కో ఆర్డినేషన్ లేదని అలాగే శాఖల విషయంలో చాలా మంది మంత్రులు తన పనితీరుని చూపించలేకపోతున్నారు అని అంటున్నారు. దాంతో అనేక మంది మంత్రుల శాఖల్లో భారీ మార్పులు ఉంటాయని అంటున్నారు. ఇక మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను రానున్న కాలంలో భర్తీ చేసే విధంగా హైకమాండ్ భారీ మార్పులకు శ్రీకారం చుడుతోంది అని అంటున్నారు. ఈ ప్రచారం అంతా ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనం మేరకు సాగుతోంది అంటున్నారు.

# లండన్‌లో నారా భువనేశ్వరికి పురస్కారం..




ఇన్ స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) సంస్థ ప్రతినిధులు ప్రతిష్ఠాత్మక డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025ను నారా భువనేశ్వరికి లండన్‌లో అందజేశారు. అరుదైన సీన్‌కు వేదికగా మారింది లండన్. భార్య పారిశ్రామికవేత్త కావటం.. భర్త ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావటం.. అంతర్జాతీయ సంస్థ ఒకటి వ్యాపారవేత్త అయిన ఆమెకు పురస్కారం అందిస్తుంటే.. ఈ కార్యక్రమానికి సీఎం హోదాలో ఉన్న భర్త ముఖ్య అతిధిగా హాజరు కావటం లాంటి రేర్ సన్నివేశాలు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే సాధ్యమవుతుందని చెప్పాలి. ఇంతకూ అసలేం జరిగిందంటే.. ఇన్ స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) సంస్థ ప్రతినిధులు ప్రతిష్ఠాత్మక డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025ను నారా భువనేశ్వరికి లండన్ లో అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు విశిష్ఠ అతిధిగా హాజరయ్యారు. హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు ఎక్స్ లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డును ఆమె అందుకున్నారు. ఒకే వేదికపై రెండు పురస్కారాలు ఒకరే అందుకోవటం కాస్త రేర్‌గా చెప్పాలి. ఇదే వేదిక మీద చంద్రబాబు ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రసంగించటం మరో విశేషంగా చెప్పాలి. ఇంతకూ నారా భువనేశ్వరికి ఏ హోదాలో ఈ పురస్కారాన్ని అందించారన్న విషయానికి వస్తే.. ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ హోదాలో ప్రజాసేవ - సామాజిక సాధికారత రంగాల్లో చేసిన విశేష క్రషికి ఈ పురస్కారాన్ని అందించారు. ఎన్టీనఆర్ ట్రస్ట్ సంస్థ రక్తదాన శిబిరాలు.. పేద విద్యార్థులకు సహాయ సహకారం.. తలసేమియా రోగులకు ఉచితంగా రక్తమార్పిడి చేయటం లాంటివెన్నో కార్యక్రమాల్ని ఆమె చేపట్టారు. సేవా భావం ఒకవైపు.. మరోవైపు దేశంలోనే ప్రతిష్ఠాత్మక డెయిరీ బ్రాండ్‌గా హెరిటేజ్‌ను తీర్చిదిద్దం మామూలు సవాలు కాదు. ఈ విషయంలో నారా భువనేశ్వరి సక్సెస్ అయ్యారని చెప్పొచ్చు. ఒకే సంస్థ.. ఒకే వేదికపైన విజయవంతమైన వ్యాపారవేత్తగా.. మరోవైపు సేవా కార్యక్రమాల్ని చేపట్టటం ద్వారా ఎంతోమందికిఅండగా నిలుస్తున్న ఆమెకు.. ఈ రెండు రంగాల్లో ఒకేసారి పురస్కారం అందుకోవటం కాస్తంత అరుదైన అంశంగా చెప్పాలి. ఏమైనా.. ఈ తరహా సన్నివేశం భవిష్యత్తులో మరింత కష్టమని మాత్రం చెప్పకతప్పదు.

# మాజీ సీఎం జగన్ టూర్ ఎఫెక్ట్..

### వైసీపీ నేతలు, కార్యకర్తలకు పోలీసు షాక్ ట్రీట్మెంట్!



కృష్ణా జిల్లాలో మాజీ సీఎం జగన్ పర్యటనలో నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలపై పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ప్రధానంగా పోలీసు విధినిర్వహణకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తో సహా పలువురిపై చర్యలకు రంగం సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మంగళవారం కృష్ణా జిల్లాలోని పెనమలూరు, పామర్రు, పెడన నియోజకవర్గాల్లో మాజీ సీఎం జగన్ పర్యటించిన విషయం తెలిసిందే. మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రైతులను పరామర్శించేందుకు జగన్ రాగా, ఆయన పర్యటనలో వైసీపీ నేతలు, కార్యకర్తలు నిబంధనలు అతిక్రమించారని పోలీసులు చర్యలకు సిద్ధమయ్యారు. కృష్ణా జిల్లాలో మాజీ సీఎం జగన్ పర్యటనకు పది కార్లు, 500 మంది కార్యకర్తలు, నాయకులకు మాత్రమే పోలీసులు అనుమతిచ్చారు. కానీ, పోలీసు నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చారు. ఎక్కడికక్కడ రోడ్ షో చేయడంతోపాటు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అంతేకాకుండా జగన్ వాహన శ్రేణిలో దాదాపు 70 నుంచి 80 కార్లతో హల్ చల్ చేశారని పోలీసులు ఆరోపిస్తున్నారు. వైసీపీ కార్యకర్తల వల్ల గండిగుంట గ్రామంలో పరస్పరం వాహనాలు ఢీకొని పలువురు గాయపడ్డారు. దీంతో పోలీసు విధి నిర్వహణకు ఆటంకం కలిగించడం, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమణ వంటి ఆరోపణలతో వైసీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. జగన్ పర్యటన సందర్భంగా డ్రోన్ విజువల్స్ చిత్రీకరించిన పోలీసులు, ఆ వీడియో ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తిస్తున్నారు. జగన్ తాడేపల్లి నుంచి పెనమలూరు, ఉయ్యూరు, పామర్రు, గూడురు మీదుగా ప్రయాణించగా, విజయవాడ-బందరు జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం అయింది. దీంతో డ్రోన్ వీడియో ఫుటేజీ ద్వారా ట్రాఫిక్ సమస్యలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పై పోలీసులు కేసులు నమోదు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటనలో గోపువానిపాలెం గ్రామం వద్ద ట్రాఫిక్ సమస్య తేవొద్దని సీఐ చిట్టిబాబు వారిస్తే, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ ఆయనతో వాగ్వాదానికి దిగినట్లు పోలీసులు అభియోగాలు నమోదు చేశారు. మరోవైపు జగన్ పర్యటనపై అధికార పార్టీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. వైసీపీ అధికారంలో ఉండగా, పంటల బీమా ఎగ్గొట్టిన జగన్ ఇప్పుడు అబద్దాలు చెబుతున్నారని ఆరోపించింది మరోవైపు తుఫాన్ వెళ్లిన వారం రోజులుకు తీరిగ్గా వచ్చిన ప్రతిపక్ష నేత, తుఫాన్ సమయంలో ఎక్కడున్నారని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో రైతుల సమస్యలపై సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు గుర్తు చేస్తున్నారు. మరోవైపు తుఫాన్ సహాయక చర్యలపై తమను తప్పుపట్టడంపై మంత్రి లోకేశ్ కూడా స్పందించారు. అప్పుడప్పుడు ఏపీకి వచ్చే జగన్.. ఎప్పుడూ జనం మధ్య ఉన్న తమను వేలెత్తిచూపడం విడ్డూరంగా ఉందని ఆయన వ్యాఖ్యా నించారు. జగన్ ఒక వేలు ఎత్తి చూపుతున్నారు. కానీ ఆయనపైపు నాలుగు వేళ్లు ఉన్నాయనే విషయాన్ని మరచిపోతున్నారంటూ లోకేశ్ దెప్పిపొడిచారు.

# ఇక్కడ గుంతలు లేవు... వాటే థాట్ బ్రో !

రోడ్లు అన్నవి ప్రధాన సమస్యగా మారిపోతున్నాయి. ఎందుకంటే రోడ్ల కోసం ఎంత వెచ్చించి అభివృద్ధి చేసినా వాటి నాణ్యత ఎంత బాగా ఉన్న హెవీ ట్రాఫిక్ తో పాటు భారీ వర్షాలు కురిసి రోడ్లను సర్వ నాశనం చేస్తున్నాయి. రోడ్ల మీద గుంతలు పెద్ద ఎత్తున ఏర్పడుతున్నాయి. ఒకపుడు రోడ్లు వేస్తే కనీసం అయిదేళ్ళ పాటు ఉండేవి, ఇటీవల కాలంలో గట్టిగా రెండేళ్ళు ఉంటే గొప్పే అన్నట్లుగా వాతావరణం మారింది.

**ప్రమాదాలకు రీజన్ :** రోడ్ల మీద భారీ స్థాయిలో ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు సైతం కారణం అవుతున్నాయి. చేవేళ్లలో తాజాగా జరిగిన ఆర్టీసీ బస్సు కంకర టిప్పర్ ప్రమాదంలో భారీ గుంతల వల్లనే జరిగింది అన్నది అందరికీ తెలిసిందే. దాంతో వాహనదారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా ప్రమాదాలు అలా జరిగిపోతూనే ఉన్నాయి. దీనికి ఏమిటి పరిష్కారం అని పాలకులు ఆలోచించేలోగానే ఈ యాక్సిడెంట్ల సంఖ్య అయితే భారీగా పెరిగిపోతోంది.




**విజయవాడలో చూస్తే :** ఇక ఏపీకి రాజకీయ రాజధానిగా బిజీ సెంటర్ గా విజయవాడకు ఎంతో పేరు ఉంది. విజయవాడ రోడ్లు నిత్యం రద్దీగా ఉంటాయి. దాంతో పాటు ఇపుడు అభివృద్ధి అంతా అక్కడే ఉండడంతో ఫ్లోటింగ్ పాపులేషన్ కూడా బాగా పెరిగింది. దాంతో విజయవాడలో చాలా రోడ్లు భారీ ట్రాఫిక్ వల్ల తరచూ గుంతలు పడుతున్నాయి. దాంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో అదే బిగ్ ప్రాబ్లం గా మారుతోంది. ఇక వానలు పెద్ద ఎత్తున కురిస్తే కనుక గుంతలలో నీరు నిండి ప్రమాదాల స్థాయిని మరింత పెంచుతున్నాయి. అక్కడ గుంత ఉంది అన్నది కూడా తెలియక స్పీడ్ గా వాహనం పోనిస్తే టూ వీలర్స్ పూర్తిగా అందులో పడి యాక్సిడెంట్లు అవుతున్నాయి.

**స్మార్ట్ ఐడియా :** విజయవాడ జాతీయ రహదారి ప్రసాదంపాడు, రామవరప్పాడు వద్ద భారీ వర్షాలకు రోడ్లు మునుగుతున్నాయి. దాంతో గుంతలు ఏమిటి మ్యాన్ హోల్స్ ఏమిటి అన్నది ఎవరికీ సరిగా కనిపించడం లేదు, దాంతో ఈ పరిస్థితిని గమనించిన విజయవాడ ట్రాఫిక్ పోలిఈసులు ఒక స్మార్ట్ ఐడియాను ప్లాన్ చేశారు. దానికి అమలు చేసి మరి మంచి మార్కులు కొట్టేసారు. ఇంతకీ ఆ సూపర్ ఐడియా ఏమిటి అంటే ఇక్కడ రోడ్లకు గుంతలు లేవు అని ప్ల కార్డులు పట్టుకుని నిలబడడం, మీరు హాయిగా హ్యాపీగా మీ జర్నీ కొనసాగించవచ్చు అని రాసి పెట్టిన ప్ల కార్డులను వారు ప్రదర్శిస్తూండదంతో వాహనదారులు నిశ్చింతగా తమ వెహికిల్స్ జోరు పెంచి ముందుకు సాగుతున్నారు.

**థాంక్స్ టూ పోలీస్ :** నిజానికి ఈ రహదారికి వచ్చేసరికి వాహనదారులు చాలా స్లోగా నడుపుతున్నారు. ఎందుకంటే ఏ గుంతలో ఏ మ్యాన్ హోల్స్ లో తమ వాహనం దిగబడుతుందో అనన్ భయంతో. అయితే ట్రాఫిక్ పోలీసులే వారిని అప్రమత్తం చేస్తూ గుంతలు లేవు అన్న ప్ల కార్డులు ప్రదర్శించడంతో ఏ భయం లేకుండా గేర్ మార్చి స్పీడ్ పెంచుతున్నారు. ట్రఫిక్ పోలీసులు ఈ సూపర్ థాట్ తో తీసుకున్న చర్యల పట్ల వాహనదారులు అంతా ఫుల్ హ్యాపీగా ఫీల్ అవడమే కాదు థాంక్స్ టూ ట్రాఫిక్ పోలీస్ అని కూడా కితాబు ఇస్తున్నారు. ఇక దీని వల్ల ట్రాఫిక్ కూడా చాలా వేగంగా క్లియర్ అవుతోందని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. రెండిందాలుగా లభంగా ఉంది ఈ వ్యవహారం. ఏది ఏమైనా విధి నిర్వహణలో ఉన్న వారు కూడా సమాయనికి తగిన విధంగా కొత్త ఆలోచనలు చేస్తే రోడ్ల మీద ప్రయాణం సాఫీగా సాగుతుంది ప్రమాదాలకు కూడా ఆస్కారం ఉండదని విజయవాడ ట్రాఫిక్ పోలీసులు నిరూపించారు అన్న మాట.

# గుండె చెదిరే కాంతి!



రాత్రి పూట కళ్లు చెదిరే కాంతిలో ఉండటం వల్ల మెదడుపై ఒత్తిడి పెరిగి, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్' (ఎ.హెచ్.ఎ.) ప్రాథమిక అధ్యయ నంలో వెల్లడైంది. కాంతి తీవ్రత మెదడుపై ఒత్తిడిని కలిగించటమే కాక, ధమనుల వాపునకూ కారణమై పలు రకాల హృద్రోగాలకు దారితీస్తున్నట్లు అధ్యయనవేత్తలు గుర్తించారు. రాత్రిపూట ఉండే కృత్రిమ కాంతిని కూడా 'కాలు ష్యమే' అంటున్నారు శాస్త్రవేత్తలు. అది ఎంత ఎక్కు వ ఉంటే అంత ఎక్కువ కాలుష్యం అన్నమాట. ఇలా రాత్రిపూట కృత్రిమ కాంతికి, గుండెజబ్బులకు మధ్య ఉన్న సంబంధాన్ని తెలుసుకునేందుకు 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్' (ఎ.హెచ్.ఎ.) పరిశోధకులు.. ప్రధానంగా మెదడు స్కాన్‌లను పరిశీలించారు. వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం వంటి పర్యా వరణ కారకాల ఒత్తిడి మన నరాలు, రక్తనాళాలను ప్రభావితం చేయటం ద్వారా గుండె జబ్బులకు దారితీస్తాయన్నది తెలిసిందే. అయితే ఇప్పుడు తీవ్రస్థాయి కాంతి కాలుష్యం కూడా అందుకు ఏ మాత్రం తీసిపోలేదని ఎ.హెచ్.ఎ. గుర్తించింది.

**గుండెపోటు అవకాశాలు ఎక్కువ**

' రాత్రిపూట అధిక స్థాయి కృత్రిమ కాంతికి గురవుతున్న వ్యక్తుల మెదడుపై ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. అది రక్తనాళాల వాపునకు కారణం అవుతోంది.

' మెదడు ఒత్తిడిని గ్రహించినప్పుడు అది రోగ నిరోధక ప్రతిస్పందనను ప్రేరేపించటం వల్ల రక్తనాళాల్లో వాపు మొదలౌతోంది. క్రమేణా ఈ వాపు... ధమనులు గట్టి పడటానికి దోహ దం చేసి గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతోంది.

' రాత్రిపూట ఎక్కువగా కాంతి అధికంగా పడిన వారిలో గుండెపోటు వచ్చే అవకాశం 47 శాతం ఎక్కువగా ఉంది.

' కృత్రిమ కాంతి ప్రభావం.. నిద్రించే వ్యవధి, శారీరక శ్రమ, సామాజిక ఆర్థిక స్థితిగతులు, పొరుగింటి చప్పుళ్ల వంటి అంశాలతో సంబంధం లేకుండా అందరిపైనా ఒకేలా ఉంటోంది.

' శరీరంపై కృత్రిమ కాంతి ఎక్కువగా పడటం వల్ల దేహధర్మాల సహజత్వానికి అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా జీర్ణక్రియ మందగిస్తోంది. హార్మోన్ల సమతౌల్యం దెబ్బతింటోంది. తద్వారా అధిక రక్త పోటు, ఊబకాయం, మధుమేహం మొదలౌతున్నాయి. మెదడులో నాళాలు చిట్లటమూ జరుగుతోంది.

**ఇలా తగ్గించుకోవచ్చు**

ఇండోర్ లైట్‌లను మసకబార్చటం, వెలుతురును తగ్గించే బ్లాక్ అవుట్ కర్టెన్‌లను ఉపయోగించటం, నిద్రకు ఉపక్రమించే ముందు స్క్రీన్ వర్క్ (స్మార్ట్‌ఫోన్ లేదా ల్యాప్‌టాప్ వంటివి) ఆపేయటం వంటివి మెదడుపై ఒత్తిడిని తగ్గిస్తాయి.

**35 శాతం అధికం**

అమెరికా, యూకే వంటి దేశాల్లో జరిగిన పలు అధ్యయనాల ప్రకారం.. 5 ఏళ్ల పాటు రాత్రిపూట అధిక కృత్రిమ కాంతి ప్రభావం వల్ల హృద్రోగాల ప్రమాదం దాదాపు 35% వరకు ఎక్కువగా ఉందని తేలింది. గుండెకు ఆక్సిజన్, రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు సంకోచించే అవకాశాలూ (కరొనరీ ఆర్టెరీ డిసీజ్ %-% సీఏడీ) ఎక్కువగా ఉన్నాయట.

# ప్రతి 8 మంది ఓటర్లలో ఒకరు నకిలీ


**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ బుధవారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఓటు చోరీ ఆరోపణలతో పాటు 'హెచ్' ఫైల్స్‌ను బహిర్గతం చేశారు. హర్యానాలో 25,41,144 లక్షల ఓటు చోరీ కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. 'మా దగ్గర 'హెచ్' ఫైల్స్ ఉన్నాయి. రాష్ట్రంలో ఓటు చోరీ ఎలా జరిగిందో దానిలో ఉంది. ఇది రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో జరుగుతోందని అనుమానిస్తున్నాం. హర్యానాలోని మా అభ్యర్థులు.. ఏదో తప్పు జరిగిందంటూ ఫిర్యాదులు విరివిగా చేశారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. హర్యానా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపించిన రాహుల్ .. కాంగ్రెస్ విజయాన్ని బీజేపీ విజయంగా మార్చేందుకు ఒక ప్రణాళికను అమలు చేశారని ఆరోపించారు. హర్యానాలో 25 లక్షల ఓట్లు చోరీ అయ్యాయని, ఇందులో 5.21 లక్షల నకిలీ ఓటర్లు, 93,174 చెల్లని ఓటర్లు, 19.26 లక్షల బల్క్ ఓటర్లు ఉన్నారని రాహుల్ పేర్కొన్నారు. తాను చెబుతున్న దానికి 100 శాతం రుజువు



ఉందని, వారు కాంగ్రెస్ విజయాన్ని ఓటమిగా మార్చడానికి వ్యవస్థాగత తారుమారుకు పాల్పడ్డారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. హర్యానాలో రెండు కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 25 లక్షల మంది నకిలీ ఓటర్లు అని విలేకరుల సమావేశంలో రాహుల్ తెలిపారు. తన బృందం 5.21 లక్షల నకిలీ ఓటరు నమోదులను బయటపెట్టిందని, హర్యానాలో ప్రతి ఎనిమిది మంది ఓటర్లలో ఒకరు నకిలీవారున్నారు. ఓటరు జాబితాలో వ్యత్యాసాలను చూపించే స్లయిడ్‌లను రాహుల్ ప్రదర్శించారు. ఓటు చోరీ కోసం బ్రెజిలియన్ మోడల్ వాడారని ఆరోపించారు. ప్రజాస్వామ్య ప్రక్రియను అణిచివేసేందుకు బీజేపీ ప్రణాళికాబద్ధమైన ఆపరేషన్‌ను నిర్వహిస్తోందని రాహుల్ ఆరోపించారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ హర్యానాలో కాంగ్రెస్ విజయాన్ని సూచించాయని గుర్తుచేశారు. హర్యానా చరిత్రలో తొలిసారిగా, పోస్టల్ బ్యాలెట్లు వాస్తవ ఓట్లతో సరిపోలలేదని, ఇది ఇంతకు ముందు ఎప్పుడూ జరగలేదని, కాంగ్రెస్ అఖండ విజయాన్ని ఓటమిగా మార్చడానికి ఒక ప్రణాళికను అమలు చేశారని రాహుల్ ఆరోపించారు. అయితే ఎన్నికల కమిషన్ వర్గాలు రాహుల్ గాంధీ వాదనలను తోసిపుచ్చాయి. రాష్ట్ర ఓటర్ల జాబితాకు వ్యతిరేకంగా "సున్నా అప్పీళ్లు" దాఖలు అయ్యాయన్నారు.

# ఎస్ఐఆర్‌ను మీరు సపోర్ట్ చేస్తున్నారా.. వ్యతిరేకిస్తున్నారా..?

**న్యూఢిల్లీ:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో తీర్పును బీజేపీ తారుమారు చేసిందని, 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది ఆయన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పేర్కొంది. హర్యానాలో ఓటర్ల జాబితాపై ఒక్క అప్పీల్ కూడా రాలేదని వివరించింది. హర్యానా ఎన్నికల ఫలితాన్ని బీజేపీ చోరీ చేసిందని, గెలుపు కోసం ఎన్నికల కమిషన్‌తో ఆ పార్టీ కుమ్మక్కయిందని రాహుల్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈసీ తాజా వివరణ ఇచ్చింది. హర్యానాలో కాంగ్రెస్‌కు దక్కాల్సిన అద్భుత విజయాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడం ద్వారా 'ఆపరేషన్ సర్కార్ చోరీ' జరిగిందని రాహుల్ ఆరోపించారు. ఎన్నికల కమిషనర్లు బీజేపీతో కుమ్మక్కయ్యారని అన్నారు. దీనిపై ఈసీ స్పందిస్తూ, 90 అసెంబ్లీ స్థానాలకు గాను కేవలం 22 ఎలక్షన్ పిటిషన్లు మాత్రమే హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపింది. బూత్‌లలో ఉన్న కాంగ్రెస్ పోలింగ్ ఏజెంట్ల పాత్రను ఈసీ నిలదీసింది. ఆ పార్టీ పోలింగ్ ఏజెంట్లు ఏం చేస్తున్నట్టు? ఓటరు ఎవరైనా అప్పటికే ఓటు వేసినట్టు అనుమానం వచ్చినా, ఓటరు ఐడెంటిటీపై అనుమానం




వచ్చినా అప్పుడే అభ్యంతరం వ్యక్తి చేసి ఉండొచ్చని పేర్కొంది.

**ఎస్ఐఆర్‌పై మీ వైఖరి ఏంటి?**

పౌరసత్వ వెరిఫికేషన్‌తో పాటు డూప్లికేట్లను, చనిపోయిన వారిని, చిరునామా మార్చుకున్న ఓటర్లను తొలగించేందుకు చేపట్టిన ఎస్ఐఆర్‌ను రాహుల్ గాంధీ సపోర్ట్ చేస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? అని ఈసీ ప్రశ్నించింది. కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లు ఎందుకు అభ్యంతరాలు లేవనెత్తలేదని ప్రశ్నించింది. ఒకే పేరు పదేపదే రాకుండా నిరోధించేందుకు రివిజన్ జరిగినప్పుడు కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లు అభ్యంతరం చెప్పి ఉండవచ్చని పేర్కొంది. అక్టోబర్ 1 నుంచి అక్టోబర్ 15 వరకూ బిహార్‌లో ఎస్ఐఆర్ సమయంలో కూడా కాంగ్రెస్ ఎందుకు అప్పీల్ చేయలేకపోయిందో చెప్పాలని పేర్కొంది.

**రాహుల్ ఏమన్నారు?**

హర్యానాలో 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని, టాప్-5 ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పినప్పటికీ బీజేపీ గెలిచిందని న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాహుల్ తెలిపారు. ఒక నియోజకవర్గంలో ఒక ఫోటోతో వంద ఓట్లున్నాయని, అనేక బూతులలో ఫేక్ ఓట్లున్నాయని, అక్రమాలు బయటకు రావద్దని ఎన్నికల సంఘం సీసీటీవీ ఫుటేజ్‌ను డిలీట్ చేసిందని ఆరోపించారు. బ్రెజిలియన్ మోడల్, యూపీ బీజేపీ ఓటర్లు, డూప్లికేట్ ఓటర్లు, ఓటర్ల తొలగింపుతో హర్యానాలో గెలిచారని అన్నారు. యూపీ, హర్యానాలో వేల సంఖ్యల్లో డూప్లికేట్ ఓటర్లున్నారని, యూపీలో ఓటు వేసే వ్యక్తికి హర్యానాలో కూడా ఓటు ఉందని తెలిపారు. బిహార్‌లోనూ ఓట్ల చోరీ జరుగుతుందని, అక్కడ ఎన్నికల తరువాత ఓట్ల చోరీ అంశాన్ని బయటపెడతామని అన్నారు.

# జనవరిలో గగన్‌యాన్ పరీక్ష.. 2035 నాటికి స్పేస్ ల్యాబ్

**న్యూఢిల్లీ :** మానవరహిత గగన్‌యాన్ ప్రాజెక్టుకు చెందిన కీలక విషయాన్ని ఇస్రో చైర్మెన్ వీ నారాయణన్ వెల్లడించారు. గగన్‌యాన్ ప్రాజెక్టు సంబంధించిన పరీక్షను జనవరిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. అంతరిక్షంలోకి మానవులను పంపాలని ఇస్రో ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. దీని కోసం గగన్‌యాన్ ప్రాజెక్టును చేపట్టింది. అయితే స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన రాకెట్‌లో ఆస్ట్రోనాట్లను అంతరిక్షంలోకి పంపాలని ఇస్రో భావిస్తున్నది. ఈ ప్రయోగాన్ని 2027లో చేపట్టాలన్న సంకల్పంతో ఉన్నట్లు ఇస్రో చీఫ్ నారాయణన్ తెలిపారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా అనేక పరీక్షలు జరుగుతున్నట్లు ఇస్రో చీఫ్ చెప్పారు. ఇప్పటికే ఆ మిషన్‌కు చెందిన సుమారు 8000 టెస్టులను నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. ఇవాళ ఢిల్లీలో జరిగిన ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ సదస్సులో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. భూ కక్ష్యలోకి మానవులను పంపడానికి ముందు.. కనీసం మూడుసార్లు మానవరహిత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. భారతీయ అంతరిక్ష స్టేషన్‌కు చెందిన కీలక విషయాన్ని కూడా ఆయన వెల్లడించారు. 2028లో భారతీయ అంతరిక్ష స్టేషన్‌కు



చెందిన ఫస్ట్ మాడ్యూల్‌ను లాంచ్ చేయనున్నట్లు ఇస్రో చీఫ్ చెప్పారు. మొత్తం అయిదు మాడ్యూల్స్‌ను నింగిలోకి పంపనున్నారు. ఫైవ్ మాడ్యూల్ ఆర్బిటాల్ ల్యాబ్‌ను 2035లో ఆపరేషన్‌లోకి తీసుకున్నట్లు నారాయణన్ తెలిపారు. భారతీయ స్పేస్ స్టేషన్ కనీసం 52 టన్నుల బరువు ఉండనున్నది. ముగ్గురు లేదా నలుగురు వ్యోమగాములు ఉండే రీతిలో దీన్ని నిర్మిస్తున్నారు. స్వల్ప కాలం ఆరుగురు ఉండే రీతిలో స్పేస్ స్టేషన్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు.

## బీజాపూర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్



ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య బుధవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించినట్లు సమాచారం. తెలంగాణ సరిహద్దుకు సమీపంలోని తార్లగూడ ప్రాంతంలో ఈ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే... అన్నారం, మరిమల్ల గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై నిఘా వర్గాల నుంచి పక్కా సమాచారం అందింది. దీంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బృందాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను, కొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అయితే, దీనిపై అధికారికంగా పూర్తి ప్రకటన వెలువడాల్సి ఉంది. బుధవారం సాయంత్రం నాటికి కూడా ఆపరేషన్ కొనసాగుతూనే ఉందని అధికారులు వెల్లడించారు. "బీజాపూర్ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతోంది, పరిస్థితి సాధారణంగానే ఉంది. ఆపరేషన్‌కు సంబంధించిన కీలక వివరాలను తగిన సమయంలో అందిస్తాం" అని మధ్యాహ్నం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనపై స్పందిస్తూ, హతమైన మావోయిస్టులు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పనిచేస్తున్న స్థానిక కమిటీలకు చెందినవారై ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

**ముమ్మరంగా కూంబింగ్**

2026 మార్చి నాటికి దేశం నుంచి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవలే ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్లను తీవ్రతరం చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2024 జనవరిలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1,785 మందిని అరెస్ట్ చేశారు. వివిధ ఆపరేషన్లలో 477 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఒకవైపు సైనిక చర్యలు కొనసాగిస్తూనే, మరోవైపు 'ఆత్మసమర్పణ్ ఏవం పునర్వాస్ నీతి 2025', 'నియాద్ నెల్ల నార్ యోజన' వంటి పథకాల ద్వారా లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తూ ప్రభుత్వం ద్వంద్వ వ్యూహాన్ని అమలు చేస్తోంది.

## నేడు బీహార్ పోలింగ్

**పాట్నా :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన తొలి దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో ఓటింగ్ జరగనుంది. ఈ దశలో మొత్తం 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, పలువురు ప్రముఖ నేతల భవితవ్యం తేలనుంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు పోలింగ్‌పైనే కేంద్రీకృతమైంది. ముఖ్యంగా హోరాహోరీ పోరు నెలకొన్న కీలక నియోజకవర్గాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కేబినెట్‌లోని 16 మంది మంత్రులు ఈ దశలో తమ స్థానాలను నిలబెట్టుకునేందుకు పోటీ పడుతున్నారు. వీరిలో 11 మంది బీజేపీ కోటాకు చెందినవారు కాగా, ఐదుగురు జేడీ(యూ) మంత్రులు ఉన్నారు. ఈ ఎన్నికలు నితీశ్ ప్రభుత్వ పాలన, విశ్వసనీయతకు ఒకరకంగా అగ్నిపరీక్షగా మారాయి. మరోవైపు, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఆయన సోదరుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్ ప్రతాప్ యాదవ్ కూడా తమ స్థానాల్లో గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు.

**అభ్యర్థులు, ఆసక్తికర పోరు**

ఈ ఎన్నికల్లో పలు నియోజకవర్గాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ముంగేర్ జిల్లాలోని తారాపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఆర్జేడీ అభ్యర్థి అరుణ్ కుమార్ షాతో పాటు, జన్ సురాజ్, జన్ తంత్రిక్ జనతాదళ్ అభ్యర్థులు కూడా బరిలో ఉండటంతో చతుర్ముఖ పోరు నెలకొంది. వైశాలి జిల్లాలోని రాఘోపూర్, తేజస్వి యాదవ్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. ఇక్కడ ఆయన ఎన్డీయే అభ్యర్థి సతీశ్ యాదవ్‌ను ఢీకొంటున్నారు. పాట్నా రూరల్ పరిధిలోని మొకామా స్థానం, దులార్‌చంద్ యాదవ్ హత్య కేసు నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడ జేడీ(యూ) నుంచి అనంత్ సింగ్, ఆర్జేడీ నుంచి వీణా దేవి పోటీ పడుతున్నారు. ఇద్దరూ బలమైన రాజకీయ కుటుంబాలకు చెందిన వారు కావడంతో పోరు రసవత్తరంగా మారింది. ఈ ఎన్నికల్లో కళారంగానికి చెందిన ప్రముఖులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రముఖ జానపద గాయని మైథిలి ఠాకూర్‌ను బీజేపీ దర్భంగా జిల్లాలోని అలీనగర్ నుంచి బరిలోకి దించింది. ఆమె ఆర్జేడీ అభ్యర్థి వినోద్ మిశ్రాతో తలపడుతున్నారు. మిథిలాంచల్ ప్రాంతంలో మైథిలికి ఉన్న ప్రజాదరణ ఆమెకు ఎంతవరకు కలిసొస్తుందో చూడాలి. భోజ్‌పురి సూపర్ స్టార్ కేసరి లాల్ యాదవ్ సారన్ జిల్లాలోని ఛాప్రా నుంచి ఆర్జేడీ తరఫున పోటీ చేస్తున్నారు. ఇక, లఖిసరాయ్‌లో ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా కాంగ్రెస్ అభ్యర్థితో తలపడుతూ వరుసగా మూడో విజయంపై కన్నేశారు. బేగుసరాయ్‌లో బీజేపీ అభ్యర్థి కుందన్ కుమార్‌కు, కాంగ్రెస్‌కు చెందిన అమితా భూషణ్‌కు మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ కుల సమీకరణాలు కీలకం కానున్నాయి. పాట్నాలోని పట్టణ నియోజకవర్గమైన బకీపూర్‌లో బీజేపీ నేత నితిన్ నబిన్ మరోసారి పోటీ చేస్తున్నారు.

## ట్రంప్‌నకు కోలేకోలేని దెబ్బ

## పార్టీకి దక్కని ప్రాధాన్యం

**న్యూయార్క్ :** అమెరికాలో జరిగిన 2025 స్థానిక ఎన్నికల్లో డెమోక్రట్ పార్టీకి ఘన విజయం లభించింది. వర్జీనియా, న్యూ జెర్సీ గవర్నర్ ఎన్నికలు, న్యూయార్క్ సిటీ మేయర్ రేసు సహా ముఖ్యమైన పోటీలలో డెమోక్రట్లు మొత్తం స్వీప్ చేశారు. ఇది రెండోసారి అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంప్‌కు మొదటి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్, ఆర్థిక సమస్యలు, ట్రంప్ విధానాలపై అసంతృప్తి కారణంగా ఓటర్లు డెమోక్రట్ల వైపు మొగ్గు చూపారు. ఈ ఎన్నికలు ట్రంప్ రెండో టర్మ్ ప్రారంభానికి మొదటి పెద్ద టెస్ట్‌గా మారాయి. వర్జీనియాలో డెమోక్రట్ అబిగెయిల్ స్పాన్‌బర్గర్ రిపబ్లికన్ విన్సమ్ ఎర్ల్-సియార్స్‌ను ఓడించి గెలిచి, వర్జీనియా చరిత్రలో మొదటి మహిళా గవర్నర్‌గా చరిత్ర సృష్టించింది. ఓటర్లు ఫెడరల్ వర్క్‌ఫోర్స్ లేఅవుట్లు, షట్‌డౌన్ ప్రభావాలపై ఆగ్రహం చూపారు. న్యూ జెర్సీలో కూడా డెమోక్రట్ మికీ షెరిల్ ట్రంప్ ఎండోర్స్‌మెంట్ పొందిన రిపబ్లికన్ జాక్ సియాటరెల్లిని ఓడించారు. 1961 తర్వాత మొదటిసారి ఒకే పార్టీ మూడు వరుసగా గవర్నర్ పదవులు దక్కించుకుంది. షెరిల్ రెండో మహిళా గవర్నర్‌గా రికార్డు సృష్టించారు. న్యూయార్క్ సిటీ మేయర్ రేసులో డెమోక్రట్ జోరాన్ మమ్దానీ ఇండిపెండెంట్ ఫార్మర్ గవర్నర్ ఆండ్రూ కుమో, రిపబ్లికన్ కర్టిస్ స్లివాను ఓడించి గెలిచారు. ట్రంప్ ఈ ఫలితాలను సోషల్ మీడియాలో తీవ్రంగా విమర్శించారు. న్యూయార్క్ మమ్దానీ విజయాన్ని "డిసాస్టర్" అని, బ్యాలెట్ ప్రాసెస్‌ను "స్కామ్" అని పిలిచారు. ట్రంప్ తన హోమ్ టౌన్‌లో ఈ ఓటమి తీవ్రంగా తీసుకుని, ఫెడరల్ ఫండింగ్ ఉపసంహరించుకుని, సిటీని టేకోవర్ చేస్తానని హెచ్చరించారు. డెమోక్రట్ లీడర్లు ఈ విజయాన్ని "ట్రంప్ అజెండాపై పెద్ద ఓటమి"గా చూస్తున్నారు. మాజీ ప్రెసిడెంట్ బరాక్ ఒబామా భవిష్యత్ వెలుగులు కనిపిస్తున్నాయన్నారు.

## బిజినెస్ వాయిస్

### త్వరలో మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్



భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలుస్తుందని, త్వరలో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. మంగళవారం జరిగిన ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (డీఎస్ఈ)లో డైమండ్ జూబ్లీ కార్యక్రమంలో మాట్లాడిన ఆమె.. భారత్ చాలా భిన్నమైన అంశాల ఆధారంగా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం మనం సాధిస్తున్న ఆర్థిక వృద్ధి అందరినీ కలుపుకుని సాగుతున్నది. అందుకే దేశంలో 2.5 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురాగలిగాము. ఇది మనందరి సహకారమని తెలిపారు. 2014లో పదవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ స్థానం నుంచి ఐదవ, నాల్గవ స్థానానికి, త్వరలో 2027-28 నాటికి మూడవ స్థానానికి చేరేందుకు వేగంగా వృద్ధి సాధిస్తున్నది. ప్రస్తుతం ఐదవ స్థానంలో ఉన్న భారత్, రాబోయే కొన్నేళ్లలో 5 ట్రిలియన్ డాలర్లను దాటి జపాన్, జర్మనీలను అధిగమిస్తుంది. భారత్ స్వాతంత్ర్యం సాధించి 100వ సంవత్సరం చేరే 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగలదని అంచనా వేస్తున్నాం. పెరుగుతున్న విదేశీ పెట్టుబడులు, కృత్రిమ మేధ(ఏఐ) వంటి సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పాటు తయారీ, డిజిటల్ సేవలు, మౌలిక సదుపాయాలలో పనితీరు ద్వారా ఈ వృద్ధి సాధ్యమవుతుందని నిర్మలా సీతారమన్ పేర్కొన్నారు.

### అమెరికా నుంచి రికార్డ్ చమురు కొనుగోళ్లు



అమెరికా నుంచి చమురు దిగుమతులు నూతన రికార్డ్‌లను చేరాయి. ఇటీవల యూఎస్ అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ ఆంక్షలకు ప్రధాని నరేంద్ర మోడీ తలొగ్గి ఆ దేశం నుంచి భారీగా చమురు కొనుగోళ్లను పెంచారు. చౌకగా లభించే రష్యా చమురును తగ్గించడం గమనార్హం. ఈ ఏడాది అక్టోబర్ అమెరికా నుంచి భారత్‌కు గత ఐదేండ్లలో ఎప్పుడూ లేని స్థాయి గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. డేటా అనలిటిక్స్ సంస్థ కెప్లర్ నివేదిక ప్రకారం.. అక్టోబర్‌లో యూఎస్ నుంచి భారత్ రోజుకు సగటున 5,68,000 బ్యారెల్స్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. 2021 మార్చి తర్వాత ఈ స్థాయిలో దిగుమతులు జరగడం ఇదే మొదటిసారి. సెప్టెంబరులో దిగుమతులైన 2,07,000 బ్యారెల్స్‌తో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ కావడం ఆందోళనకరం. ఇది ట్రంప్ ఆంక్షలకు భారత్ తలొగ్గిందనడానికి నిదర్శనమని నిపుణులు భావిస్తున్నారు.భారతదేశం మొత్తం ముడి చమురు దిగుమతుల్లో యూఎస్ వాటా 12 శాతానికి పెరిగింది. ఇంతక్రితం సెప్టెంబర్‌లో ఇది 4.5 శాతంగా ఉంది. అమెరికా నుంచి దిగుమతులు పెరిగినప్పటికీ.. రష్యా ఇప్పటికీ భారతదేశానికి అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా కొనసాగుతోంది. అక్టోబర్‌లో భారత్ దిగుమతుల్లో రష్యా వాటా 34 శాతంగా ఉండటం విశేషం. రష్యా నుంచి రోజుకు 16.2 లక్షల బ్యారెల్స చమురు దిగుమతి అయ్యింది. ఇరాక్, సౌదీ అరేబియా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ట్రంప్ ఆదేశాల మేరకు రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదు. అమెరికాకు సహకరిస్తామన్న ప్రధాని మోడీ హామీ మేరకు భారత రిఫైనరీలు అమెరికా కంపెనీల నుంచి చమురు బుకింగ్ పెంచుకున్నట్టు వాణిజ్య, ప్రభుత్వ వర్గాల సమాచారం

# టాటా ట్రస్ట్‌ల ట్రస్టీ పదవి నుంచి వైదొలిగిన మెహ్లి మిస్త్రీ!



మెహ్లీ మిస్త్రీ మూడు ప్రధాన టాటా ట్రస్ట్‌ల ట్రస్టీ పదవికి రాజీనామా చేశారు. వివాదాలను నివారించి, రతన్ టాటా స్థాపించిన నైతిక విలువలు, సుపరిపాలన, సమగ్రతను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన లేఖలో పేర్కొన్నారు. మిస్త్రీ గత ఏడాది జీవితకాల ట్రస్టీగా తిరిగి నియమించబడినప్పటికీ, ప్రధాన ట్రస్ట్‌ల ఆమోదం లభించకపోవడంతో ఈ వివాదం చెలరేగింది. సర్ రతన్ టాటా ట్రస్ట్, సర్ దోరాబ్జీ టాటా ట్రస్ట్, బాయి హీరాబాయి జీచీ టాటా నవ్‌సరి ఛారిటబుల్ ఇన్‌స్టిట్యూషన్ ట్రస్ట్ అనే మూడు ప్రధాన టాటా ట్రస్ట్‌ల ట్రస్టీ పదవి నుంచి తాను వైదొలగుతున్నట్లు మెహ్లి మిస్త్రీ మంగళవారం ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని టాటా ట్రస్ట్‌ల ట్రస్టీలకు రాసిన లేఖలో తెలియజేశారు. నవంబర్ 4 నాటి తన లేఖలో మిస్త్రీ ట్రస్టీగా పనిచేయడం తనకు దక్కిన అదృష్టమని, ఈ అవకాశం దివంగత రతన్ ఎన్ టాటా వ్యక్తిగత ఆమోదం ద్వారా లభించిందని, ఆయనను తన అత్యంత ప్రియమైన స్నేహితుడు, గురువుగా అభివర్ణించారని అన్నారు. ముంబైకి తిరిగి వచ్చిన తర్వాత తన ట్రస్టీషిప్ గురించి ఇటీవలి నివేదికల గురించి తనకు తెలిసిందని, టాటా ట్రస్ట్‌ల ప్రయోజనాలకు ఉపయోగపడదని, దాని దార్శనికతకు విరుద్ధమని తాను నమ్ముతున్న ఊహాగానాలకు ముగింపు పలకడానికి తన లేఖ సహాయపడుతుందని ఆయన అన్నారు. రతన్ టాటా నిలబెట్టిన విలువలకు తన నిబద్ధతను మిస్త్రీ పునరుద్ఘాటించారు. తన బాధ్యతలను నిర్వర్తించడంలో, నైతిక పాలన, నిశ్శబ్ద దాతృత్వం, సమగ్రత సూత్రాల ద్వారా తాను మార్గనిర్దేశం పొందినట్లు ఆయన పేర్కొన్నారు. తాను 2025 అక్టోబర్ 28 వరకు ట్రస్టీగా పనిచేశానని ఆయన ధృవీకరించారు. దాతృత్వ సంస్థ ప్రతిష్టను ప్రభావితం చేసే వివాదాలను నివారించాల్సిన అవసరంతోనే తాను పదవీ విరమణ చేయాలనే నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. రతన్ టాటా దార్శనికతకు తాను విధేయత చూపడంలో టాటా ట్రస్ట్‌లు ప్రజా వివాదంలో చిక్కుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా ఉందని ఆయన రాశారు. ఈ విషయాన్ని తొందరపెట్టడం వల్ల టాటా ట్రస్టుల ప్రతిష్టకు శాశ్వత నష్టం వాటిల్లుతుందని ఆయన అన్నారు. రతన్ టాటా ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్న స్ఫూర్తితో, ట్రస్టీలు పారదర్శకత, సుపరిపాలన, విస్తృత ప్రజల పట్ల శ్రద్ధతో వ్యవహరిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "నేను విడిపోతున్నాను" అని మిస్త్రీ లేఖను ముగించారు. "సంస్థ కంటే ఎవరూ గొప్పవారు కాదు" అని రతన్ టాటాను ఉటంకించారు.

# స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేవారికి బిగ్ అలర్ట్!



ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు బుల్లిష్ పథంలో ఉన్నాయి. అయితే, గోల్డ్‌మన్ సాచ్స్, మోర్గాన్ స్టాన్లీ రాబోయే 12-24 నెలల్లో 10-20 శాతం దిద్దుబాటును అంచనా వేస్తున్నాయి. దీనిని దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్‌లో సాధారణ క్షీణతగా చూడాలని సూచించాయి. గత కొన్ని నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు బుల్లిష్ పథంలో ఉన్నాయి. ూా× కంపెనీల పెరుగుదల, రేటు కోతల అంచనాలు, బలమైన కార్పొరేట్ ఆదాయాలు మార్కెట్‌ను కొత్త ఎత్తులకు పంపించాయి. అమెరికా, జపాన్, కొరియా, చైనాలలో సూచీలు రికార్డు స్థాయిలో ఉన్నాయి. రెండు బ్యాంకులు (గోల్డ్‌మన్ సాచ్స్, మోర్గాన్ స్టాన్లీ) రాబోయే సంవత్సరాల్లో ఆసియా, ముఖ్యంగా భారతదేశం, చైనా, జపాన్, హాంకాంగ్ ప్రపంచ వృద్ధికి కేంద్రంగా మారుతాయని విశ్వసిస్తున్నాయి. భారత దేశంలో మౌలిక సదుపాయాల సౌకర్యాలు, తయారీ వేగం, అలాగే జపాన్‌లో కార్పొరేట్ సంస్కరణలు రెండూ దీర్ఘకాలంలో మార్కెట్‌కు శుభవార్త. స్టాక్ మార్కెట్‌లో ర్యాలీ తర్వాత స్వల్ప క్షీణత సాధారణమేనని గోల్డ్‌మన్ సాచ్స్, మోర్గాన్ స్టాన్లీ చెబుతున్నారు. గోల్డ్‌మన్ సాచ్స్ సీఈఓ డేవిడ్ సోలమన్ ప్రకారం రాబోయే 12 నుండి 24 నెలల్లో మార్కెట్ 10 నుండి 20 శాతం వరకు పడిపోవచ్చు. అయితే ఈ క్షీణత దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్‌లో భాగంగా ఉంటుంది. చిన్న చిన్న షాక్‌లకు భయపడే బదులు పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడం కొనసాగించి, వారి పోర్ట్‌ఫోలియోలను తిరిగి సమతుల్యం చేసుకోవాలని ఆయన అన్నారు. సరళంగా చెప్పాలంటే మీ పెట్టుబడులను సమీక్షించండి, ఈ క్షీణతతో తొందరపడకండి. మోర్గాన్ స్టాన్లీ జజూా టెడ్ పిక్ ప్రకారం మార్కెట్‌లో 10-15 శాతం క్షీణత చెడ్డ విషయం కాదు. కొన్నిసార్లు మార్కెట్ స్లో అవుతుంది, మళ్లీ పుంజుకుంటుంది. ×వీఖీ, ఖూ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్, బ్రిటిష్ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ గవర్నర్ ఆండ్రూ బెయిలీ కూడా మార్కెట్ విలువలు చాలా ఎక్కువగా ఉన్నాయని హెచ్చరించారు. కాబట్టి మార్కెట్ క్షీణించినట్లయితే దానిని క్రాష్ కాకుండా దిద్దుబాటుగా పరిగణించండి. బలమైన పోర్ట్‌ఫోలియోలు ఉన్నవారు ఈ సమయంలో భయపడాల్సిన అవసరం లేదని సోలమన్, పిక్ ఇద్దరూ అంటున్నారు.

# భారత జట్టు ప్రకటన.. కెప్టెన్‌గా డీకే..

## పన్నెండు జట్ల వివరాలు ఇవే

హాంకాంగ్ క్రికెట్ సిక్సెస్-2025 టోర్నమెంట్‌కు భారత్ తమ జట్టును ప్రకటించింది. హాంకాంగ్‌లో నవంబరు 6 నుంచి 9 వరకు మోంగ్ కాక్ వేదికగా జరిగే ఈ పొట్టి టోర్నీలో భారత్‌కు.. మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ సారథ్యం వహించనున్నాడు. డీకేతో పాటు రాబిన్ ఊతప్ప, స్టువర్ట్ బిన్నీ, అభిమన్యు మిథున్, భరత్ చిప్లి, షాబాజ్ నదీమ్‌లు హాంకాంగ్ క్రికెట్ సిక్సెస్‌లో పాల్గొననున్నారు. అదే విధంగా.. దేశీ వెటరన్ క్రికెటర్ ప్రియాంక్ పాంచల్ కూడా ఈ టోర్నీలో భాగం కానున్నాడు.

**ఆరు ఓవర్ల పాటు ఆట**

కాగా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన హాంకాంగ్ క్రికెట్ సిక్సెస్ టోర్నీలో.. ఒక్కో టీమ్‌లో ఆరుగురు సభ్యులు (మాజీ క్రికెటర్లు) ఉంటారు. ఆరు ఓవర్ల పాటు ఆట సాగుతుంది. ఇక ఈ షార్టెస్ట్ క్రికెట్ ఈవెంట్లో 2005లో టైటిల్ గెలిచిన భారత్.. రెండుసార్లు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అయితే, గతేడాది రాబిన్ ఊతప్ప కెప్టెన్సీలో కనీసం ఫైనల్ కూడా చేరలేదు టీమిండియా. ఈ నేపథ్యంలో ఈసారి కొత్త సారథిగా డీకే రావడం విశేషం. కాగా తాజా ఎడిషన్‌లో పన్నెండు జట్లు పాల్గొంటున్నాయి.

**పన్నెండు జట్లు ఇవే**

భారత్, పాకిస్తాన్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, అఫ్గనిస్తాన్, నేపాల్, ఇంగ్లండ్, యూఏఈ, కువైట్, శ్రీలంక, బంగ్లాదేశ్, హాంకాంగ్ (చైనా) ఈసారి టోర్నీలో భాగం కానున్నాయి. పూల్- 'ఏ' నుంచి సౌతాఫ్రికా అఫ్గనిస్తాన్, నేపాల్.. పూల్- 'బి' నుంచి ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ యూఏఈ.. పూల్- 'సి' నుంచి ఇండియా, పాకిస్తాన్, కువైట్... పూల్- 'డి' నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్, హాంకాంగ్ పోటీపడతాయి.

హాంకాంగ్ సిక్సెస్-2025లో పాల్గొనే జట్ల వివరాలు



**భారత్**
దినేశ్ కార్తిక్ (కెప్టెన్), రాబిన్ ఊతప్ప, స్టువర్ట్ బిన్నీ, అభిమన్యు మిథున్, భరత్ చిప్లి, షాబాజ్ నదీమ్, ప్రియాంక్ పాంచల్.

**ఆస్ట్రేలియా**
అలెక్స్ రాస్ (కెప్టెన్), బెన్ మెక్‌డెర్మాట్, జాక్ వుడ్, నిక్ హెూబ్సన్, క్రిస్ గ్రీన్, విల్ బొసిస్టొ, ఆండ్యూ టై.

**ఇంగ్లండ్**
జో డెన్లీ (కెప్టెన్), జేమ్స్ కోల్స్, ఈథన్ బ్రూక్స్, టోబీ అల్బర్ట్, జార్జ్ హిల్ డాన్ మౌస్లే, టామ? అస్పిన్‌వాల్.

**బంగ్లాదేశ్**
అక్బర్ అలీ (కెప్టెన్) అబు హైదర్ రోని, జిషాన్ ఆలం, మొహమ్మద్ సైఫుద్దీన్, మొసాడెక్ హెుసేన్, రకీబుల్ హసన్, టొఫేల్ అహ్మద్.

**యూఏఈ**
కౌశిక్ హర్షిత్ (కెప్టెన్), ఖలీద్ షా, ముహమ్మద్ అర్ఫాన్, ముహమ్మద్ ఫారూక్, ముహమ్మద్ సాగిర్ ఖాన్, నిలాన్ష్ కేస్వాని, రెజిత్ కురుంగొడె, జాహిద్ అలీ.

**కువైట్**
యాసిన్ పటేల్ (కెప్టెన్), ఉస్మాన్ పటేల్, మీట్ భవ్సార్, బిలాల్ తాహిర్, రవిజ సాండరువాన్, అద్నాన్ ఇద్రీస్, మొహమద్ షఫీక్.

**నేపాల్**
శరద్ వేసావ్కర్ (కెప్టెన్), సందీప్ జోరా, లోకేశ్ బామ్, బాసిర్ అహ్మద్, ఆదిల్ ఆలం, రషీద్ ఖాన్, రూపేశ్ సింగ్.

**శ్రీలంక**
లాహిరు మధుషాంక (కెప్టెన్), ధనంజయ లక్షణ్, తనుక దబారే, నిమేశ్ విముక్తి, లాహిరు సమారకూన్, థారిందు రత్నాయక, సచిత జయతిలకె.

**సౌతాఫ్రికా**
జోర్డాన్ మోరిస్ (కెప్టెన్), అబ్దుల్లా బయోమి, ఈథన్ కన్నింగ్‌హామ్, బులెలొ దూబే, కషీఫ్ జోసెఫ్, బ్లేక్ సింప్సన్, జోరిచ్ వాన్ షాల్వేక్.

**హాంకాంగ్**
యాసిమ్ ముర్తజా (కెప్టెన్), బాబర్ హయత్, అన్షుమాన్ రథ్, ఐజాజ్ ఖాన్, నిజాకత్ ఖాన్, ఎహ్‌సాన్ ఖాన్, నస్రుల్లా రాణా.

**అఫ్గనిస్తాన్**
గుల్బదిన్ నైబ్ (కెప్టెన్), ఇక్రామ్ అలిఖిల్, కరీం జన్నత్, షరాఫుద్దీన్ ఆష్రఫ్, ఫర్మానుల్లా సఫీ, ఐజాజ్ అహ్మద్ అహ్మద్‌జాయ్, సెదీకుల్లా పచా.

**పాకిస్తాన్**
అబ్బాస్ ఆఫ్రిది (కెప్టెన్), అబ్దుల్ సమద్, ఖవాజా మొహమద్ నఫాయ్, మాజ్ సదాకత్, మొహమద్ షాజాద్, సాద్ మసూద్ షాహిద్ అజీజ్.

### నరాలు తెగే ఉత్కంఠ: సాంట్నర్ విధ్వంసకర ఇన్నింగ్స్ వృథా

న్యూజిలాండ్ పర్యటనను వెస్టిండీస్ క్రికెట్ జట్టు ఘనంగా ఆరంభించింది. ఆఖరి వరకు ఉత్కంఠగా సాగిన తొలి టీ20లో ఆతిథ్య కివీస్‌పై విండీస్ ఏడు పరుగుల స్వల్ప తేడాతో విజయం సాధించింది. తద్వారా ఐదు టీ20ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. కాగా ఐదు టీ20 మ్యాచ్‌లు, మూడు టెస్టులు, మూడు వన్డేలు ఆడేందుకు వెస్టిండీస్.. న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం ఆక్లాండ్‌లో ఇరుజట్ల మధ్య తొలి టీ20 జరిగింది. ఈడెన్ పార్క్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ తొలుత బౌలింగ్ ఎంచుకుని.. విండీస్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (3), అలిక్ అథనాజ్ (16) విఫలమైనా.. వన్‌డౌన్ బ్యాటర్ షాయ్ హెూప్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. మొత్తంగా 39 బంతులు ఎదుర్కొన్న హెూప్ నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్ల సాయంతో 53 పరుగులు సాధించాడు. మిగతా వారిలో రోస్టన్ చేజ్ (28), రోవ్‌మన్ పావెల్ (23 బంతుల్లో 33) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశారు. కివీస్ బౌలర్లలో జేకబ్ డఫీ, జకారీ ఫౌల్క్స్ రెండేసి వికెట్లు తీయగా.. కైలీ జెమీషన్, జేమ్స్ నీషమ్ చెరో వికెట్ పడగొట్టారు. ఇక విండీస్ విధించిన 165 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ ఆది నుంచే తడబడింది. ఓపెనర్లు టిమ్ రాబిన్సన్ (27), డెవాన్ కాన్వే (13) ప్రభావం చూపలేకపోయారు. వన్‌డౌన్ బ్యాటర్ రచిన్ రవీంద్ర (21) నిరాశపరచగా.. మార్క్ చాప్‌మన్ (7), డారిల్ మిచెల్ (13), మైకేల్ బ్రాస్‌వెల్ (1), జేమ్స్ నీషమ్ (11) పూర్తిగా విఫలమయ్యారు.

## క్రీడా వాయిస్

### ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. నెంబర్ వన్ ర్యాంకుల్లో అభిషేక్ శర్మ, వరుణ్ చక్రవర్తి..!



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. టీమిండియా యువ బ్యాటర్స్ అభిషేక్ శర్మ నెంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఈ ఎడమచేతి వాటం బౌలర్ ఆసియా కప్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లోనూ తనదైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. దాంతో నెంబర్ వన్ బ్యాటర్‌గా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. మరో టీమిండియా ఆటగాడు తిలక్ వర్మ మూడోస్థానంలో ఉన్నాడు. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. రెండోస్థానంలో ఇంగ్లండ్ ప్లేయర్ ఫిల్ సాల్ట్, నాలుగో స్థానంలో నిస్సంక (శ్రీలంక), నాలుగో స్థానంలో జోస్ బట్లర్ (ఇంగ్లండ్), ఆరోస్థానంలో ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా), ఏడోస్థానంలో టిమ్ సీఫెర్ట్ (న్యూజిలాండ్), తొమ్మిద స్థానంలో కుషాల్ పెరీరా (శ్రీలంక), పదో స్థానంలో మిచేల్ మార్ష్ (ఆస్ట్రేలియా) ఉన్నారు. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో విజయం తర్వాత పాక్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్ మెరుగయ్యాయి. కెప్టెన్ బాబార్ ఆజం తొమ్మిదిస్థానాలు మెరుగుపరుచుకొని 30వ స్థానానికి చేరుకున్నాడు. సైమ్ అయూబ్, సల్మాన్ ఆఘా పదిస్థానాలు ఎగబాకి 39, 54 స్థానాలకు చేరారు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హెూప్ 12వ స్థానానికి, బంగ్లాదేశ్‌కు చెందిన టాంజిద్ హసన్ 17వ స్థానానికి, ఆఫ్ఘనిస్తాన్ ద్వయం రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్ వరుసగా 15, 20వ స్థానాల్లో ఉన్నారు. ఇక టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అగ్రస్థానాన్ని నిలుపుకోగా.. ఆస్ట్రేలియాకు చెందిన జోష్ హేజిల్‌వుడ్ రెండుస్థానాలు మెరుగుపరుచుకొని 10వ స్థానానికి చేరాడు. బంగ్లాదేశ్‌కు చెందిన ముజీబ్ ఉర్ రెహమాన్, మహేది హసన్ 14, 17వ స్థానానికి చేరుకున్నారు. వెస్టిండీస్‌కు చెందిన జాసన్ హెూల్డర్, రోస్టన్ చేజ్ 23, 38వ స్థానానికి చేరుకున్నారు. పాక్‌తో జరిగిన సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన దక్షిణాఫ్రికా బౌలర్ కార్బిన్ బాష్ 15 స్థానాలు ఎగబాకి 38వ స్థానానికి చేరుకున్నాడు. టీమిండియా మరో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఐదు ర్యాంకులు దిగజారి 15వ స్థానానికి పడిపోయాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో పాక్ ఆటగాడు ఆయుబ్ నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. జింబాబ్వే ప్లేయర్స్ సికందర్ రజా, వెస్టిండిస్ ప్లేయర్ రోస్టన్ చేజ్ వరుసగా రెండు, మూడో స్థానాలకు చేరుకున్నారు. టీ20ల్లో రజా 33 బంతుల్లో చేసిన సెంచరీతో ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపరుచుకున్నాడు. టీమిండియా ఆల్‌రౌండర్ హర్దిక్ పాండ్యా రెండు ర్యాంకులు దిగజారి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. అలాగే, అక్సర్ పటేల్ నాలుగు ర్యాంకులు దిగజారి 170 పాయింట్లతో 15వ స్థానానికి చేరాడు. అభిషేక్ శర్మ 16వ స్థానంలో ఉన్నాడు.

# అనగనగా ఒక రాజు కోసం సింగర్‌గా.. నవీన్ పొలిశెట్టి

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి నటిస్తోన్న చిత్రం అనగనగా ఒక రాజు ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ వెడ్డింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమాను 2026 జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారు. మ్యాడ్ ఫేం కళ్యాణ్ శంకర్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయాల్సి ఉండగా.. మారి చేతుల్లోకి వెళ్లింది. కాగా ఈ సినిమా కోసం నవీన్ పొలిశెట్టి సింగర్‌గా మారిపోయాడన్న వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. తాజా సమాచారం ప్రకారం నవీన్ పొలిశెట్టి పాడిన ఈ పాట నవంబర్ మూడో వారంలో లాంచ్ కానుంది. ఇప్పటిదాకా విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ కామిక్ టచ్‌తో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్‌లో నవీన్ పొలిశెట్టి లుంగీ, బనియన్ వేసుకుని, మెడలో రుమాలు వేసుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తూ క్యూరియాసిటీ పెంచుతున్నాడు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో ఈ చిత్రంలో మీనాక్షిచౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.

**ప్రీ వెడ్డింగ్ వీడియో..**

రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది.






## సుధీర్ బాబు 'జటాధర' నుంచి కొత్త ట్రైలర్

నటుడు సుధీర్ బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జటాధర' ఈ సినిమాకు వెంకట్ కళ్యాణ్ %ఆ% అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తుండగా.. వెంకట్ కళ్యాణ్ కథనందిస్తున్నాడు. తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రాబోతుంది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా కీలక పాత్రలో నటించబోతుంది. నవంబర్ 07న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రం విడుదలకు సంబంధించిన అన్ని పనులను పూర్తి చేసుకుంటుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్‌లను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా కొత్తగా రిలీజ్ ట్రైలర్‌ను వదిలింది. మైథాలాజికల్, సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రైన్ అంజలి, శిల్పా శిరోడ్కర్ కీలక పాత్రల్లో నటిస్తుండగా.. జీ స్టూడియో సమర్పణలో ఉమేశ్ కె.ఆర్.భన్సాల్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.




## మోహన్‌లాల్ కుమారుడి థ్రిల్లర్ సినిమా

మలయాళ స్టార్ మోహన్ లాల్ కుమారుడు ప్రణవ్ మోహన్‌లాల్ హీరోగా నటిస్తున్న చిత్రం డియస్ ఈరే.. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ స్రవంతి మూవీస్ ఈ చిత్రాన్ని నవంబర్ 7న తెలుగులో విడుదల చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. నిజజీవిత సంఘటనల ఆధారంగా ఈ మూవీని తెరకెక్కిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. మోహన్ లాల్ తనయుడు ప్రణవ్ మోహన్ లాల్ మూవీ కావడంతో తెలుగు ఆడియన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. భూత కాలం', మమ్ముట్టి 'భ్రమ యుగం' చిత్రాలకు దర్శకత్వం వహించిన రాహుల్ సదాశివన్ ఈ మూవీకి దర్శకత్వం వహించారు.

# ఆ విషయంలో టాలీవుడ్‌ను చూసి నేర్చుకోండి

బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సుధీర్ బాబు హీరోగా వస్తోన్న జటాధర మూవీతో తెలుగు ఇండస్ట్రీలో అడుగుపెడుతోంది. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా.. సోనాక్షి రోల్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ మూవీ నవంబర్ 7న రిలీజవుతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్లతో బిజీగా ఉన్న బాలీవుడ్ నటి సౌత్ ఇండస్ట్రీపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. తెలుగు పరిశ్రమలో పనిచేసిన తన అనుభవాన్ని పంచుకుంది. దక్షిణాది సినీ ఇండస్ట్రీని చూసి బాలీవుడ్ కొన్ని విషయాలు నేర్చుకోవాలని సోనాక్షి సిన్హా అభిప్రాయం వ్యక్తం చేసింది. దక్షిణాది సినీ పరిశ్రమలో సమయపాలన పాటిస్తారని తెలిపింది. తొమ్మిది గంటలకు షూటింగ్‌కు వస్తే సాయంత్రం ఆరు వరకే ఉంటుందని.. ఈ విషయంలో వారిని అభినందించాల్సిందేనని అన్నారు. వారిని చూసి బాలీవుడ్ మేకర్స్ నేర్చుకోవాలని హితవు పలికింది. బాలీవుడ్‌లో అర్ధరాత్రి వరకు షూటింగ్స్ జరుగుతుంటాయని విమర్శించింది. సౌత్‌లా చేయాలంటే క్రమశిక్షణ అవసరమని సోనాక్షి వెల్లడించింది. తెలుగు చిత్ర పరిశ్రమను చూసైనా బాలీవుడ్ మారాలని సలహా ఇచ్చింది. తన మొదటి తెలుగు ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతూ..' స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. ప్రాంతీయ భాషల్లో సినిమాలు చేసేందుకు ఉత్సాహంగా ఉన్నా. గతంలో నేను (లింగా) ఒక తమిళ సినిమా చేశా. ఇప్పుడు తెలుగు ఇండస్ట్రీలో చేశా. ఎల్లప్పుడూ ఇలాంటి చిత్రాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నా. కానీ అంతకు ముందు నా షెడ్యూల్ కుదరక సినిమాలు ఒప్పుకోలేదు' అని చెప్పింది ఆ తర్వాత వర్క్ లైఫ్ ప్రస్తావిస్తూ..' హిందీ, తెలుగు సినిమా పని సంస్కృతిని పోల్చి చూస్తే.. దక్షిణది పరిశ్రమలో సమయపాలన గ్రేట్. అక్కడ పని, లైఫ్ బ్యాలెన్స్ చాలా బాగుంది. ఈ విషయాన్ని వారి నుంచి మనం కచ్చితంగా నేర్చుకోవాల్సిందే. సెట్‌లోని క్రమశిక్షణ తనకు ప్రత్యేకంగా అనిపించింది. ఉదయం తొమ్మిది గంటలకు షూటింగ్‌కు వెళ్తే.. ఆరు గంటల తర్వాత అస్సలు షూట్ చేయరు. అది నిజంగా చాలా గ్రేట్. ఇక్కడ తెలుగు సినీ పరిశ్రమలో క్రమశిక్షణను అంగీకరించాల్సిన విషయం' అని తెలిపింది. కాగా.. జటాధర మూవీలో ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా కనిపించనుంది.





# వైరలవుతున్న జూనియర్ ఎన్టీఆర్ కొత్త లుక్

దేవర, వార్ 2 సినిమాలతో సూపర్ హిట్లు అందుకున్నాడు అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ అయితే తారక్ తన సినిమా సినిమాకి లుక్‌ని మారుస్తూ వస్తున్న విషయం తెలిసిందే. అభిమానుల అభిరుచులకు అనుగుణంగా ప్రతి సినిమాకి మేకోవర్ మార్చుకుంటూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. ఇప్పటికే వార్ 2 కోసం ప్రత్యేక లుక్‌లో కనిపించిన ఉన్న తారక్.. దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో రాబోతున్న డ్రాగన్ ప్రాజెక్ట్ కోసం కొత్త లుక్ ట్రై చేస్తున్నాడు. ఈ సినిమాలో తారక్ ఎవరు ఊహించని లుక్‌లో కనిపించ బోతున్నట్లు తెలుస్తుంది. తాజాగా ఎన్టీఆర్ స్టైలిష్ క్రాఫ్, గడ్డం, గాగుల్స్ తో బ్లూ జీన్స్ ట్రౌజర్ వేసుకుని ఎయిర్‌పోర్ట్ నుంచి వెళుతుండగా కెమెరాకు ఫోజులిచ్చాడు తారక్. కాగా ఇందుకు సంబంధించిన లుక్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ప్రశాంత్ నీల్ డ్రాగన్ ప్రాజెక్ట్ కోసమే తారక్ ఇంత కష్టపడుతున్నాడని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com